ఈనాడు
వరంగల్
అర్బన్

గురువారం 24 ఆగస్టు 2017 | 16 పేజీలు

సమన్వయంతో పని చేయండి



గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు కమిషనర్ సుధీర్ బాబు, నగర పాలక సంస్థ కమిషనర్ శ్రుతి పాల్గొన్నారు.

15లో..



100% ఉద్యోగాలు

'ఈనాడు' ముఖాముఖిలో నిట్ డైరెక్టర్ జీఆర్‌సీ రెడ్డి

- నాణ్యమైన పరిశోధనలకు పెద్దపీట
- వచ్చే నెలలో స్నాతకోత్సవం
- కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రాక
- నిధుల సమస్య లేదు

ఈనాడు, వరంగల్, నిట్ క్యాంపస్, న్యూస్‌టుడే

దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందు నిలపడంలో వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యా సంస్థ ఎనలేని పాత్ర పోషిస్తోంది.. ఇక్కడ చదివిన వారు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో తమదైన ముద్రవేస్తున్నారు.. కీలక స్థానాల్లో పనిచేస్తున్నారు.. గుణాత్మకమైన విద్య, పరిశోధనలకు పెద్దపీట వేస్తుండడంతో విద్యార్థులు రాటుదేలుతున్నారు... వచ్చే నెలలో స్నాతకోత్సవం జరగబోతోంది.. దీనికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టబోయే కార్యక్రమాలు, విద్యాపరమైన అంశాలపై 'ఈనాడు' సంచాలకుడు జీఆర్‌సీ రెడ్డితో ముఖాముఖి మాట్లాడింది.

ముఖాముఖి

ప్రశ్న: ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సాంకేతికతపై ఎంతో దృష్టిసారించింది. ఆ దిశగా మీ పాత్ర ఏంటి?

డైరెక్టర్: దేశంలో పరిశోధనలవైపు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా జాతీయ సాంకేతిక విద్యా సంస్థల పాత్ర ఎంతో కీలకం. వరంగల్ నిట్‌లో ఇప్పటికే విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. వీటి నాణ్యత పెంచడంపై

మిగతా 2లో...



ఇటీవల 'ఈనాడు' జిల్లా పత్రికలో ప్రచురితమైన కథనాలు


ఆలయాల్లో అక్రమాలపై

విజిలెన్స్ కన్ను!

విచారణాధికారిగా కృష్ణవేణి నియామకం

ఈనాడు కథనాలకు స్పందన

రామన్నపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆలయాల్లో జరిగిన అక్రమాలు, ఆడిటర్ లక్ష్మీనారాయణ అభ్యంతరాలపై నిగ్గు తేల్చేందుకు ఎట్టకేలకు రాష్ట్ర అధికారులు స్పందించారు. విచారణ అధికారిగా రాష్ట్ర దేవాదాయ శాఖ విజిలెన్సు అధికారి ఎంవీ. కృష్ణవేణిని నియమిస్తూ బుధవారం కమిషనర్ శివశంకర్ ఉత్తర్వులు జారీచేశారు. ఐనవోలు మల్లన్న దేవాలయంలో వేదపండితుడి వేతన బకాయిలు రూ. 1.80 లక్షలు స్వాహాచేయడం, దేవస్థానం రికార్డులు పారదర్శకంగా నిర్వహించకపోవడం తదితర అంశాలపై రెండు రోజుల క్రితం తెలంగాణ అర్చక, ఉద్యోగ ఐకాస కన్వీనర్ గంగు భానుమూర్తి ఆ శాఖ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇటీవల దేవాదాయ శాఖ మంత్రి వ్యక్తిగత సహాయకుడు వరంగల్ అర్బన్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు తెలంగాణ అర్చక సమాఖ్య ప్రతినిధులు 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాల క్లిప్పింగ్‌లను అందజేశారు. ఈ నేపథ్యంలో విచారణ అధికారి నియమితులయ్యారు. ఈమె మూడు, నాలుగు రోజుల్లో జిల్లాకు రానున్నారు. ఈ విషయం తెలియడంతో తప్పులు చేసిన అధికారులు, ఉద్యోగుల్లో దడ ప్రారంభమైంది.



సురక్షిత చర్యలేవి?

'ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయండి.. సురక్షితంగా గమ్యాన్ని చేరుకోండి' అని పదే పదే చెప్పే అధికారులు.. ప్రయాణికుల భద్రతను మాత్రం విస్మరిస్తున్నారు.. వరంగల్ రీజియన్‌లోని బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు కరవయ్యాయి... దూర ప్రాంతాలకు వెళ్లే వాటిలోనూ పెట్టడం లేదు..

వివరాలు 3లో...



డీసీసీబీ పాలకవర్గానికి వారం గడువు!

సహకార ట్రైబ్యునల్‌కు వెళ్లేందుకు అవకాశం

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: డీసీసీబీ కథ రోజుకో మలుపు తిరుగుతోంది. ఎప్పుడు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. అటు ప్రభుత్వం, ఇటు కోర్టు నుంచి ఉత్తర్వులు వెలువడుతున్నాయి. ఫలితంగా ఈ వ్యవహారం రసకందాయకంగా మారింది. సర్కారు నిర్వహించిన సమగ్ర విచారణలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. అధికారుల నివేదిక ఆధారంగా ఈనెల 17న పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు లేవని, తమపై కక్షతోనే పాలకవర్గాన్ని రద్దు చేసిందని ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, మరో 20 మంది డైరెక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన ఉన్నత న్యాయస్థానం పాలకవర్గం ఈ నెల 31 వరకు కొనసాగేందుకు

మిగతా 2లో...

మార్కెట్ ధరలు

వరంగల్ మార్కెట్: మార్కెటో బుధవారం వివిధ సరకులకు లభించిన గరిష్ఠ, కనిష్ఠ ధరలు (క్వింటాల్‌కు) రూపాయల్లో ఇలా ఉన్నాయి. ధాన్యం విజయమసూరి: 2150-2150, జేజే: 1500-1500, 1001: 1400-1400, మక్కలు: 1517-1356, మినుములు: 4855-4855, పల్లికాయ: 4630-2000, కొత్త కందులు: 4355-2786, పెసర్లు: 4415-3675, ఆముదాలు: 3511-3511, సోయాచిక్కుడు తెల్లవి: 2615-2615, చిక్కుడు: 2469-2469, పత్తి: 5240-4800, పసుపు కాడి: 7100-6100, గోల: 6700-5700, మిర్చి తేజ: 5000-2000, వండర్‌హాట్: 2000-1100, తాలు: 1000-500.

పాకాలకు పూర్వ వైభవం తేవాలి

ఖానాపురం, న్యూస్‌టుడే: క్షీణించిన అడవుల్లో అటవీ శాఖ చేపట్టిన టేకు స్టంప్స్ నాటే కార్యక్రమాన్ని జిల్లా పాలనాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, మహబూబా బాద్ ఎంపీ సీతారాంనాయక్, అటవీ శాఖ సీఎఫ్ అక్బర్, డీఎఫ్ఓ పురుషోత్తం బుధవారం పాకాలలో ప్రారంభించారు. పాకాల బోటింగ్ జెట్టీ సమీపంలో సరస్సు చుట్టూ తవ్విన కందకాల కట్టకు టేకు పిలకలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాకాలలో 4 లక్షల టేకు స్టంప్స్ నాటనున్నట్లు డీఎఫ్ఓ పురుషోత్తం తెలిపారు. నర్సంపేట పట్టణంలోని కేఎస్సార్, త్రివేణి డిగ్రీ కళాశాలలు, లక్నేపల్లిలోని బిట్స్ కళాశాల, ఎన్ఎస్ ఎస్ విద్యార్థులు అక్కడికి చేరుకొని భారీగా టేకు పిలకలు నాటారు. అనంతరం కట్ట వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ సీతారాంనాయక్ మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు కోట్ల మొక్కలు నాటినట్లు సీఎఫ్ అక్బర్ పేర్కొన్నారు. పాకాలకు పూర్వవైభవం తేవడానికి అటవీ శాఖకు సహకరించాలని ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ పురుషోత్తం, తహసీల్దార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పూల్‌సింగ్‌చౌహాన్, సర్పంచి సాయిలు, తెరాస మండల అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, ఎఫ్ఆర్వోలు రాజేశ్వర్, వసీం, సిబ్బంది శ్రీను, రమేశ్, కలీల్, నేతలు శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రమేశ్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

100 శాతం ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

దృష్టి సారించాం.

ప్రశ్న: పరిశోధనలకు సరిపడా నిధులు వస్తున్నాయా?

డైరెక్టర్: నా అనుభవంలో నిధుల కొరత అనేది ఎప్పుడూ ఎదురుకాలేదు. ఇక్కడ జరిగే పరిశోధనలకు కావాల్సిన మొత్తం కేంద్రం ఇస్తూనే ఉంటుంది. అధ్యాపకులు, పరిశోధకులు పలు జాతీయ, అంతర్జాతీయ ఫండింగ్ ఏజెన్సీల సాయంతో అద్భుతమైన ప్రాజెక్టులను రూపొందిస్తున్నారు. ఈ సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. అధ్యాపకులకు ఇటీవల మూడు అవార్డులు దక్కడం ఇక్కడి వారి ప్రతిభకు తార్కాణం.

ప్రశ్న: పరిశోధనల ఫలితాలు సమాజానికి ఎలా చేరుతున్నాయి?

డైరెక్టర్: పరిశోధనలు చేశాక దీర్ఘకాలంలో వాటి ఫలితాలు కనిపిస్తాయి. వాటికి విరామం అంటూ ఉండకూడదు. నిరంతరం సాగాల్సిన ప్రక్రియ. మొక్కలు నాటాక నీరు పోసి పెంచినట్టే, పరిశోధకులకు ప్రోత్సాహకాలు అందిస్తే భవిష్యత్తులో ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఆసక్తి ఉన్నవారినే కాకుండా, ఇతరులనూ పరిశోధనల వైపు మళ్లించే ప్రయత్నం నిట్ ద్వారా జరుగుతోంది.

ప్రశ్న: నైపుణ్యాభివృద్ధికి ఏమైనా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారా?

డైరెక్టర్: నిట్ పూర్వ విద్యార్థుల సంఘం ('ఆలుమ్ని') ఈ బాధ్యత తీసుకొంది. ఇప్పటికే క్యాంపస్ ఎదురుగా ఉన్న పున్నమి అతిథిగృహంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణం జరుగుతోంది. త్వరలో పూర్తి కానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 'టాస్క్' పేరుతో యువతలో నైపుణ్యాన్ని పెంపొందించే కార్యక్రమం చేపట్టింది. వారితో సమన్వయంతో మా అధ్యాపకుల సూచనలు, సలహాలతో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తాం.

ప్రశ్న: కొత్తగా వినూత్నమైన కార్యక్రమాలేమైనా చేపట్టబోతున్నారా?

డైరెక్టర్: నిట్‌లో జరిగే ప్రతిదీ వినూత్నమే. వచ్చే నెలలో స్నాతకోత్సవం నిర్వహిస్తున్నాం. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ ముఖ్య అతిథిగా రానున్నారు. ఈ నెల 29న 'మంతన్' పేరుతో సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. దేశ వ్యాప్తంగా 75 విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలను ఎంపిక చేయగా, అందులో మన సంస్థ ఉండడం సంతోషదాయకం. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడమే దీని లక్ష్యం. అందుకే మేం ప్రత్యేక అంశాన్ని ఎంపిక చేశాం. 'హమారా సంకల్ప్ నయా భారత్' అన్నది వరంగల్ నిట్ నినాదం. ఈ అంశంపై ఆ రోజు సమగ్ర చర్చ జరగనుంది. అంతేకాకుండా రాక్‌బ్యాండ్‌తో విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించనున్నారు.

ప్రశ్న: క్యాంపస్ ప్లేస్‌మెంట్లు ఎలా ఉన్నాయి?

డైరెక్టర్: గతేడాది 86 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారంతా ప్రముఖ కంపెనీల్లో ఆకర్షణీయమైన జీతభత్యాలను అందుకుంటున్నారు. మిగతా 14 శాతం ఉన్నత విద్య, వివిధ ప్రాజెక్టుల కోసం ఉద్యోగాల్లో చేరలేదు. అంటే నూరుశాతం ఉద్యోగాలకు ఎంపికవుతారని చెప్పాలి.

ప్రశ్న: అకడమిక్ విషయాలపై ఎలా దృష్టి సారిస్తున్నారు?

డైరెక్టర్: ఇంజినీరింగ్‌లో విపరీతమైన మార్పులు చోటుచేసుకున్నాయి. పరిశ్రమలతో ముడిపడి ఉన్న అంశాలను పాఠ్యాంశాల్లో జోడించి బోధించే దిశగా కసరత్తు చేస్తున్నాం. అధ్యాపకులు వృత్తిగతంగా మరింత నైపుణ్యం సాధించేందుకు శిక్షణ ఇపిస్తున్నాం. విదేశాల నుంచి విషయ నిపుణులను ఆహ్వానించి వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సింపోజియంలు నిర్వహిస్తున్నాం.

సర్పంచి సహా ఏడుగురికి జైలుశిక్ష

పరకాల, ఆత్మకూరు, న్యూస్‌టుడే: తెరాస గ్రామ పార్టీ కార్యాలయం ధ్వంసం కేసులో తెదేపాకు చెందిన శాయంపేట మండలం గట్లకానిపర్తి సర్పంచి వైనాల విజయ సహా మరో ఏడుగురికి బుధవారం పరకాల జూనియర్ సివిల్ జడ్జి హుస్సేన్ రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించారు. శాయంపేట ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం... 2014 ఆగస్టు 29న గట్లకానిపర్తిలో తెరాస గ్రామ శాఖ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అదే సమయంలో తొలిసారిగా గ్రామానికి వచ్చిన స్పీకర్ సిరికొండ మధుసూదనాచారిని సన్మానించాలని నిర్ణయించారు. ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పార్టీ గ్రామ శాఖ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయగా స్పీకర్ సన్మానసభకు తనను ఆహ్వానించలేదని తెదేపాకు చెందిన గ్రామ సర్పంచి వైనాల విజయ, ఆమె అనుచరులు గొడవ చేశారు. ఆ సమయంలో పార్టీ కార్యాలయ ఇంటికి సంబంధించిన షట్టర్, ఫర్నీచర్‌ను గడ్డపారతో ధ్వంసం చేయడంతో తెరాసకు చెందిన కక్కెర్ల ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సర్పంచి విజయ, వైనాల కుమారస్వామి, బత్తిని కిషన్, చిలుక గోపి, ఒంటేరు రవిచంద్ర, తప్పట్ల మొగిలి, బొమ్మకంటి చంద్రమౌళి, బొమ్మకంటి మహేందర్‌పై అప్పటి ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేశారు. 2014 నుంచి కోర్టులో కేసు నడుస్తుండగా నిందితుల్లో బత్తిని కిషన్ ఏడాది క్రితం మృతి చెందారు. కేసుకు సంబంధించిన సాక్షులను బుధవారం శాయంపేట పోలీసుస్టేషన్ కోర్టు కానిస్టేబుల్ వన్నాల శ్రీనివాస్ పరకాల జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జూనియర్ సివిల్ జడ్జి రెండేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

త్రుటిలో తప్పించుకున్న సూర్యం..!

కొత్తగూడ, న్యూస్‌టుడే: న్యూడెమోక్రసీ పెద్దచంద్రన్న వర్గానికి చెందిన సూర్యం దళానికి, పోలీసుల మధ్య బుధవారం సాయంత్రం రామన్నగూడెం అటవీ ప్రాంతంలో త్రుటిలో కాల్పులు తప్పాయి. విశ్వసనీయ వర్గాలు, ఆ పార్టీ సానుభూతిపరులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూడెమోక్రసీ సూర్యం దళం సభ్యులు బుధవారం రామన్నగూడెం అటవీ ప్రాంతంలో పలువురితో సమావేశమై చర్చిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న కొత్తగూడ పోలీసులు సీఆర్‌పీఎఫ్ బృందంతో హుటాహుటిన రామన్నగూడేనికి చేరుకొని సూర్యం దళం సమావేశమైన అటవీ ప్రాంతం వైపు వెళ్లారు. పోలీసులు వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న సూర్యం ఘటన స్థలం నుంచి దళ సభ్యులు, దళాన్ని కలిసేందుకు వచ్చిన వ్యక్తులతో సహా అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. సూర్యం దళంతో పాటు ఆయన వెంట ఉన్న ఎనిమిది మంది దళసభ్యులు అక్కడి నుంచి సురక్షితంగా బయటపడ్డారు. దీనిపై స్థానిక ఎస్ఐ సతీష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అడవిలో గుడుంబాను తయారుచేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో వెళ్లామన్నారు. దళానికి సంబంధించిన తమకెలాంటి సమాచారం లేదన్నారు. తమ రాకను తెలుసుకున్న దళం సభ్యులు పారిపోయి ఉండొచ్చన్నారు.

గణేశ్ నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నివర్గాల ప్రజలు పరస్పర సహాయ సహకారాలు అందించుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కె.దామోదర్‌రెడ్డి కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు రెండు వేలకు పైగా వినాయకుల విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. వేడుకల సందర్భంగా ఎక్కడా శాంతి భద్రతల సమస్య ఎదురుకాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా మట్టి విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు. మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, గూడూరు లాంటి మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైతే క్రేన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పోలీసు శాఖాధికారులు ట్రాఫిక్ సమస్య లేకుండా తగిన ఏర్పాట్లు చూడాలన్నారు. బక్రీద్, వినాయక చవితి వేడుకలు ఒకేసారి వస్తున్నందున ఆయా వర్గాల ప్రజలు సమన్వయంతో ఉంటూ ఎవరికి ఇబ్బంది కలగకుండా సహకరించుకోవాలని సూచించారు. ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ మండపాలు, చెరువులు, ప్రత్యేక కూడళ్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విద్యుత్తు, వైద్యశాఖ, పురపాలక శాఖాధికారులు పాల్గొన్నారు. అనంతరం జేసీ దామోదర్‌రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, డీటీవో భద్రూనాయక్, తహసీల్దార్ విజయకుమార్ మున్నేరు వాగు ప్రాంతాన్ని సందర్శించారు. నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు.

డీసీసీబీ పాలకవర్గానికి వారం గడువు!

(మొదటిపేజీ తరువాయి): బుధవారం అనుమతినిచ్చింది. తర్వాత ప్రభుత్వం జారీ చేసిన రద్దు ఉత్తర్వులు అమలులోకి వస్తే సహకార ట్రైబ్యునల్‌కు వెళ్లేందుకు అవకాశం కల్పించింది. ఈ విషయమై మళ్లీ హైకోర్టుకు పోయేందుకు అవకాశం లేదు. 31 పాలకవర్గంపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని యథాతథంగా విధుల్లో కొనసాగించాలని తీర్పును వెలువరించింది. మరో పక్క వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ డీసీసీబీ ప్రత్యేక అధికారిగా విధుల్లో చేరారు. కోర్టు ఉత్తర్వులను డైరెక్టర్లు మెయిల్ ద్వారా కలెక్టర్ పాటిల్‌కు పంపించినట్లు తెలిపారు. ఆయన నుంచి మాత్రం ఎలాంటి స్పందన రాలేదు. గురువారం సీట్లో ఎవరు కూర్చుంటారో అనే విషయం ఆసక్తిగా మారింది.

ఆ తల్లి ఓడింది.. ఈ అమ్మ గెలిచింది!


తల్లిపాలిస్తున్న మంగపేట గ్రామానికి చెందిన బాలింత రమ్య

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: అప్పుడే తల్లి గర్భం నుంచి బయటికొచ్చిన ఆనవాలుగా ఒంటికి అంటిన నెత్తుటి మరకలు పోనే లేదు... ఆ కన్నతల్లి మాత్రం మాతృత్వపు మమకారాన్ని మంటలో కలిపి తన ప్రతిరూపాన్ని అనాథను చేసింది.. ఆ అనాథ శిశువు ఆకలి కేకలు విని ఓ మాతృ హృదయం తల్లడిల్లింది. తన పాలిచ్చి అమ్మ మనసు చాటుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో రోడ్డుపై నిలబెట్టిన ఒక ఆటోలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని మహిళ అప్పుడే పుట్టిన ఆడపిల్లను తనకు భారమని భావించి వదిలేసి వెళ్లిపోయింది. పూర్తిగా తెల్లవారిన తర్వాత ఆ మార్గంలో వెళ్తున్న వారు చూడటంతో విషయం ఊరంతా తెలిసింది. ఆ చిన్నారి పరిస్థితిని చూసి మహిళలు కంటతడి పెట్టేశారు. చాలా మంది తల్లులు ఆ చిన్నారి ఏడుపు విని తల్లడిల్లిపోయారు. ఆ పసిగుడ్డును ఒక మహిళ చేరదీసి శుభ్రం చేసి వేడినీళ్లతో స్నానం చేయించింది. ఆ పసికందును అంగన్‌వాడీ కార్యకర్తలు చేరదీశారు. ఎంతకూ ఆ పసికందు ఏడుపు ఆపకపోవడంతో ఏం చేయాలా అని ఆలోచించి రెండు, మూడు రోజుల క్రితం ప్రసవించిన మహిళ కోసం ఆరా తీశారు. పస్రా గ్రామంలో మంగపేట గ్రామానికి చెందిన ఇప్పాల రమ్య ఉందని తెలిసి అక్కడికి వెళ్లారు. గుక్కపెట్టి ఏడుస్తున్న ఆ పసికందు పరిస్థితిని చూసి ఆమె వెంటనే శిశువు ఆకలి తీర్చింది. . ఒకింత ప్రాణదాతగా నిలిచింది...! ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు బత్తిని కళ్యాణి ఫిర్యాదు మేరకు పస్రా పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం ఆ పసికందును 108 వాహనంలో సిబ్బంది వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఐసీడీఎస్ అధికారులు ఆ శిశువును జిల్లా కేంద్రంలోని శిశుగృహకు తరలిస్తారని కళ్యాణి చెప్పారు.


ఆటోలో లభించిన పసికందు

5 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

రాంనగర్, న్యూస్‌టుడే: సమాజంలోని వికలాంగులకు విద్యా, ఉద్యోగాలలో 5 శాతం రిజర్వేషన్లను కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జి.నరసింహులు కోరారు. బుధవారం హన్మకొండ రాంనగర్‌లో సుందరయ్యభవన్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సమావేశం జిల్లా సదస్సు శ్రీధర్‌లోథ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహులు మాట్లాడుతూ.. తెరాస ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వస్తే వికలాంగులకు పింఛన్, అంత్యోదయ కార్డు, ఉద్యోగాలలో ప్రత్యేకమైన కోటా ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. 40 శాతం వికలాంగుడు ఉంటే అన్ని సంక్షేమ పథకాలను అర్హులవుతారన్నారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చి దానిని 60 శాతానికి పెంచిందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ.7 కోట్లు ప్రకటించారన్నారు. ఆగస్టు 27, 28 తేదీలలో సంగారెడ్డిలో జరిగే ఎన్‌పీఆర్‌డీ రెండో రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ నాయకులు మురళీ, దేవిక, కృష్ణవేణి, స్వరూప, రోశయ్య, సతీష్, యాకయ్య, రాధిక, రమేశ్, అనిల్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం.. సుఖమయం.. అని చెబుతున్న అధికారులు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం శ్రద్ధ చూపడంలేదు. ప్రైవేటు వాహనాల నుంచి పోటీని తట్టుకునేందుకు ప్రయాణికులను ఆకర్షించేందుకు రకరకాల రాయితీలను ప్రవేశపెడుతుంది. కానీ వారికి సరిపడ వసతులు కల్పించడంలేదు. ఆర్టీసీ బస్సులో క్షేమంగా గమ్యస్థానాలకు వెళ్తామనే భరోసా ప్రజల్లో ఉన్నా.. బస్సులో ఉండాల్సిన ప్రథమ చికిత్స కిట్లు ఏ ఒక్క దానిలో కనిపించడంలేదు. ఎక్కడైన ప్రమాదం జరిగి గాయాలైతే ఆసుపత్రికి పరుగెత్తాల్సిన పరిస్థితి. ఈనేపథ్యంలో బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్ల పరిస్థితిపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.



పరిశీలన

సురక్షిత చర్యలేవి?

- ఆర్టీసీ బస్సుల్లో కనిపించని ప్రథమ చికిత్స కిట్లు
- దూర ప్రాంతాలకు వెళ్లే వాటిలోనూ అంతే..


జులైవాడ, న్యూస్‌టుడే

ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలో అయిదు జిల్లాలో 9 డిపోలలో 984 బస్సులు రోజు ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేరవేస్తున్నాయి. ప్రతి రోజు 354 మార్గాలలో రోజుకు 3.84 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయి. రోజుకు 10 లక్షల మంది వివిధ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. వీటి ద్వారా ఆర్టీసీకి రోజుకు రూ1.10 కోట్ల ఆదాయం సమకూరుతుంది. దాదాపు 400 బస్సుల వరకు దూర ప్రాంతాలకు వెళ్తుంటాయి. బస్సుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం ముందు జాగ్రత్తగా ప్రథమ చికిత్స పెట్టెలను ఏర్పాటు చేయాలి. వాటిలో ప్రథమ చికిత్సకు సంబంధించిన వస్తువులను ఏర్పాటు చేయాలి. కానీ వరంగల్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో దాదాపు చాలా బస్సులకు ప్రథమ చికిత్స బాక్సులను ఏర్పాటు చేయలేదు. కొన్ని బస్సుల్లో అవి ఉన్నా ఖాళీగా కనిపిస్తున్నాయి. ఇక దూర ప్రాంతాలకు వెళ్లే సర్వీసుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు డ్రైవర్ల బట్టలు, బ్రష్‌లు, పేస్టులు తదితర వస్తువులు పెట్టుకునే చిన్నపాటి ఆల్మారాలా కనిపిస్తున్నాయి. వాటికి ప్రథమ చికిత్స పెట్టెలు అనే బదులు డ్రైవర్ పెట్టె అంటే బాగుంటుందని కొందరు ఎద్దేవా చేస్తున్నారు.



ప్రథమ చికిత్స అని రాసి ఉన్న పెట్టె





తెరిస్తే ఇలా

'న్యూస్‌టుడే' పరిశీలించగా...

- బుధవారం హన్మకొండ బస్టాండు నుంచి ఉదయం 10.40 గంటలకు శ్రీశైలం వెళ్తున్న సూపర్ లగ్జరీని 'న్యూస్‌టుడే' పరిశీలించగా అందులో ప్రథమ చికిత్స పెట్టెలో ఎలాంటి పరికరాలు కనిపించలేదు.
- మ.2.00 గంటలకు పల్మనేరు బయలుదేరుతున్న ఇంద్ర ఏసీ బస్సుల్లో చూడగా అందులో ఖాళీ పెట్టె మాత్రమే కనిపించింది.
- బెంగళూర్ వెళ్తున్న రాజధాని ఏసీ బస్సును పరిశీలించగా ప్రథమ చికిత్స పెట్టె ఉన్నా ఖాళీగా కనిపించింది.



ప్రథమ చికిత్స పెట్టెలో ఉండాల్సిన వస్తువులు

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు....

- వారం రోజుల కిందట నర్సంపేట నుంచి వస్తున్న మెట్రో బస్సు అదుపు తప్పి పొలాలలోకి వెళ్లింది. అందులో కొంతమంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రథమ చికిత్స కిట్టు లేకపోవడంతో కొంతమంది గాయపడిన వారిని దగ్గరలోని ప్రైవేటు వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న అధికారులు ఆ వైద్యుడికి కొంత డబ్బు ముట్టజెప్పినట్లు తెలిసింది.
- గత వారం హన్మకొండ లోకల్ బస్సు దిగుతున్న ప్రయాణికుడు అదుపుతప్పి హెడ్ పోస్టాఫీస్ వద్ద కిందపడగా గాయాలయ్యాయి. చేసేదేమిలేక ఆ ప్రయాణికుడు తిన్నగా వెళ్లి ఆసుపత్రిలో చేరారు.
- 15 రోజుల కిందట బీబీనగర్‌లో వజ్ర మినీ ఏసీ బస్సు ప్రమాదానికి గురైంది. అయిదుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వారు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేసుకున్నారు.
- గత నెల ఆలేరు వద్ద వజ్ర బస్సు కారు ఢీకొనడంతో ఓ బాటసారి మరణించారు. బస్సులో ఉన్న కొంతమందికి గాయాలయ్యాయి. వారు దగ్గరలోని ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నారు.

ఇలా పలు సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అధికారులు, యాజమాన్యం ప్రయాణికుల అవసరాలను గుర్తించి ప్రమాదాలను ముందు జాగ్రత్తగా బస్సులలో ప్రథమ చికిత్స సదుపాయాలను కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి

–ఆర్‌ఎం.సూర్యకిరణ్, వరంగల్ రీజియన్

ప్రథమ చికిత్స కిట్లను కొన్ని బస్సుల్లో పెట్టాం. చాలా వరకు లేవు. కార్పొరేషన్ అంతటా ఇదే పరిస్థితి ఉంది. కొన్ని చోట్ల వాటికి సెక్యూరిటీ లేక దొంగిలిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. చాలా వరకు ప్రయాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూనే ఉంటారు.

ప్రమాదాలకు బాధ్యులు ఎవరు?

–రాము, ప్రయాణికుడు



ఆర్టీసీ ప్రయాణం సురక్షితమంటారు. వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతామని చెబుతారు. కానీ తీరా చూస్తే దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో సైతం ప్రథమ చికిత్స పరికరాలు లేవు. మధ్యలో ఏదైనా చిన్నపాటి ప్రమాదం జరిగితే అప్పటికప్పుడు ఏం చేయాలి. ఆర్టీసీ యాజమాన్యం బస్సుల్లో ప్రథమ చికిత్స పరికరాలు అందుబాటులో ఉంచాలి.

ముందు జాగ్రత్తగా ఏర్పాటు చేయాలి

–తిరుపతి, ప్రయాణికుడు



ఆర్టీసీ అధికారులు ముందు జాగ్రత్తగా బస్సులలో ప్రథమ చికిత్స పెట్టెలను ఏర్పాటు చేయాలి. అనుకోకుండా ప్రమాదాలు జరిగితే అవి ఉపయోగపడతాయి. వాటితో ఎప్పటికైనా ఉపయోగమే అధికారులు ఆ దిశగా ఆలోచించాలి.

సమ సమాజ స్థాపనకు ఉద్యమాలు

పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేత విజయఖన్నా

సుబేదారి, న్యూస్‌టుడే: సమాజంలోని అసమానతల రద్దు, విద్యార్థుల హక్కుల సాధనకు విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాల్సిన తక్షణ కర్తవ్యం విద్యార్థులపై ఉందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.విజయఖన్నా పిలుపునిచ్చారు. గ్రేటర్ వరంగల్ కార్యవర్గ సమావేశం బుధవారం సుబేదారి ఆర్ట్స్ కళాశాల సెమినార్‌హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయఖన్నా మాట్లాడుతూ.. కులం, మతం పేరుతో విద్యార్థులను విభజించి వారు సంఘటితం కాకుండా అడ్డుకుంటున్నారన్నారు. విద్యార్థులు బూర్జువ రాజకీయ నాయకులు చెప్పే మాటలను నమ్మొద్దన్నారు. సొంతగా ఆలోచించాల్సిన అవసరముందని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన అనేక సమస్యలున్నప్పటికీ ప్రభుత్వం వాటిని పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు. పరిష్కరించమంటే ఉక్కుపాదంతో అణచి వేస్తుందన్నారు. డిగ్రీలో ఆన్‌లైన్ ప్రవేశాల కోసం ప్రవేశపెట్టిన దోస్త్ పథకం తప్పుల తడకగా మారిపోయిందన్నారు. విద్యార్థులు ప్రవేశాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనిని తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో వెంకట్‌రెడ్డి పీడీఎస్‌యూ నాయకులు అనిల్, తిరుపతి, రేవంత్, శ్రవణ్, శ్రీకాంత్, రంజిత్, శివ రాజేశ్, కమల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయఖన్నా

వరంగల్ తూర్పు

సీసీ కెమెరాల ఏర్పాటుకు పరిశీలన

శివనగర్, న్యూస్‌టుడే: వరంగల్ స్మార్ట్‌సిటీలో భాగంగా ఏర్పాటుచేస్తున్న సీసీ కెమెరాల కోసం బుధవారం మిల్స్‌కాలనీ సీఐ తిరుమల్, ఎస్‌బీ సీఐ రవీంద్రనాథ్ స్థల పరిశీలన చేశారు. అండర్ బ్రిడ్జి కూడలి, ఇసుక అడ్డా కూడలి, ఫోర్టురోడ్డు జంక్షన్ కూడళ్లను పరిశీలించి సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్చించారు. కెమెరాల ఏర్పాటుకు స్తంభాలను ఏర్పాటుచేయాలన్నారు.

ఏకశిలానగర్‌లో కోతుల పట్టివేత

ఏకశిలానగర్ (కరీమాబాద్), న్యూస్‌టుడే: నగరంలోని 20వ డివిజన్ ఏకశిలానగర్‌లో బుధవారం మహా నగరపాలకసంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో కోతులను పట్టుకున్నారు. ఇటీవల కోతుల సమస్యపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు స్పందించి కోతులను పట్టుకున్న వారిని పంపారని స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. కోతులు పట్టుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గణపతీ.. నీ మండపాలు భద్రమేనా..?

- ☛ నడిరోడ్లపైనే తవ్వకాలు
- ☛ విద్యుత్తు తీగలకు ఆనుకునేలా ఏర్పాటు



పాతబీటుబజార్‌లో నడిరోడ్డుపై నిర్మాణ పనులు

పాతబీటుబజార్ (మట్టెవాడ), న్యూస్‌టుడే: మరి కొన్ని గంటల్లో మహా గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని వివిధ భక్తి, యువజన సంఘాలు, కాలనీ కమిటీల ఆధ్వర్యంలో మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా వరంగల్ నగరంలోని పిన్నవారివీధి, పాతబీటుబజార్, ఎల్లంబజార్, బట్టలబజార్, పీపీచమన్ తదితర ప్రాంతాలల్లో విఘ్నేశుని మండపాలు రోడ్లకు అడ్డంగా ఏర్పాటవుతున్నాయి. కొన్ని మండపాల బాధ్యులు ఏకంగా సీసీరోడ్లు, డాంబర్‌రోడ్లను డ్రిల్లింగ్ యంత్రాలతో తవ్వి ఇనుప, కర్ర, వెదురు బొంగులతో నిర్మిస్తున్నారు. ఇలా ఏకంగా నడిరోడ్డుపై గుంజలను, ఇనుప రాడ్లను పాతడంతో పాదచారులకు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్‌లోని పాతబీటుబజార్, బట్టలబజార్ ప్రధాన రహదారిలో మండపానికి 50 అడుగుల దూరంలో సైడ్ లైటింగ్ కోసం ఇష్టారీతిన రోడ్లను పాడుచేయడం సరికాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మరోపక్క ఎల్లంబజార్‌లోని ఓ మండప నిర్మాణం ప్రమాదకరంగా మారింది. ఈ మండపాన్ని ఏకంగా విద్యుత్ తీగలకు అతి సమీపంలో నిర్మిస్తున్నారు. గణనాథుల మండపాలు నగర ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటుచేసుకోవాలని కార్పొరేషన్, పోలీస్, విద్యుత్ తదితర శాఖ అధికారులు సూచనలు చేస్తున్నా పాటించేవారు కొంతమందేనని చెబుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిర్మాణ దశలో ఉన్న మండపాలను పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న వాటిని సరైన రీతిలో ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.



ఎల్లంబజార్‌లో ప్రమాదకరంగా విద్యుత్తు తీగలకు ఆనుకునేలా..



బట్టలబజార్ ప్రధాన రహదారిలో..



బట్టలబజార్‌లో డ్రిల్లింగ్ యంత్రంతో రోడ్డుపై తవ్వుతున్న గుంత

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కొత్తవాడ, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందని 28వ డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు యెలుగం లీలావతి అన్నారు. కొత్తవాడలోని సూర్యచంద్ర స్లమ్ సమాఖ్య 4వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదుపు చేయడం అలవాటు చేసుకుంటే సంపాదిస్తున్నట్లేనని చెప్పారు. సమాఖ్య ఆర్థికంగా ఎదిగి కుటీర పరిశ్రమలు ప్రారంభించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రమ, రాణి, పద్మరాణి, అనూష, రజిత, శోభారాణి, సంతోష పాల్గొన్నారు.

సీపీఎస్‌ను నిరసిస్తూ వైద్యుల సామూహిక సెలవు

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను నిరసిస్తూ సెప్టెంబర్ 1 నుంచి సామూహిక సెలవులో వెళ్తామని బుధవారం సీకేఎం ఆసుపత్రి వైద్యులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు రాజేంద్రప్రసాద్‌కు సెలవుపత్రాలను అందజేశారు. సీపీఎస్‌ఈఏ వైద్యుల విభాగం కాకతీయ వైద్యశాల బ్రాంచి అధ్యక్షుడు డాక్టరు వెంకటస్వామి ఆధ్వర్యంలో సీకేఎం ఆసుపత్రి వైద్యులు సామూహికంగా వెళ్లి సూపరింటెండెంట్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టరు మల్లికార్జున్, ప్రచార కార్యదర్శి డాక్టరు బింగి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు డాక్టరు సునిల్‌కుమార్, సభ్యులు డాక్టరు పి. శాంతి జ్యోత్స్న, డాక్టరు ఎస్. శ్వేతరెడ్డి, డాక్టరు ఎ. కల్యాణి, డాక్టరు ఆర్. శ్రీవిద్య, డాక్టరు అనిత, డాక్టరు రంజిత్ తదితరులున్నారు.

తట్టు రూబెల్లా టీకాపై సమీక్ష

శివనగర్, న్యూస్‌టుడే: నగరంలో అమలుచేస్తున్న తట్టు, రూబెల్లా టీకా కార్యక్రమంపై బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టరు హరీష్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లాలో పర్యటించిన జాతీయ, అంతర్జాతీయ పరిశీలకులు, జిల్లా కార్యక్రమ అధికారులు గమనించిన అంశాలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా ఐదు రోజుల కాలంలో 99,150 మంది పిల్లలకు టీకాలు వేసినట్లు వివరించారు. ఇప్పటివరకు పట్టణ ప్రాంతంలో అధికంగా పాఠశాలలున్నందున పీహెచ్‌సీల పరిధిలోని కొందరు ఏఎన్ఎంలను డిప్యూటేషన్‌పై తీసుకురావాలన్నారు. ఇమ్యునైజేషన్ టెక్నికల్ సపోర్టు యూనిట్ నుంచి వచ్చిన డాక్టరు రూమాభార్గవ్ మాట్లాడుతూ వ్యాక్సిన్ ఇంజక్షన్లు ఇచ్చే విధానంలో పూర్తి జాగ్రత్తలు పాటించాలన్నారు. నేపాల్ ప్రతినిధి డాక్టరు రాజేంద్రప్రసాద్ జమిరే. డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి డాక్టరు ప్రగత్ కుమార్, డీఐవో డాక్టరు శ్యామనీరజ, మాస్ మీడియా అధికారి వి. అశోక్‌రెడ్డి, డాక్టరు సాజిదాఅతారి గమనించిన పలు విషయాలను వైద్యాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు డాక్టరు రూమాభార్గవ్ నగరంలోని పలు పాఠశాలలు, మదర్సాలలో టీకాల అమలును పరిశీలించారు.



నగరంలోని పాఠశాలలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అంతర్జాతీయ ప్రతినిధి డాక్టరు రూమాభార్గవ్

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

పిన్నవారివీధి (మట్టెవాడ), న్యూస్‌టుడే: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే కొండా సురేఖ రూ. 3.40 లక్షల విలువైన సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేఖ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అనూహ్యంగా ప్రమాదాలు సంభవించి ఆర్థికంగా నష్టపోయినవారికి సీఎం సహాయ నిధి ఆసరాగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో 26వ డివిజన్‌కు చెందిన తెరాస నాయకులు గౌతమ్, చందర్, మధు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సురేఖ

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె విరమణ

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: డిమాండ్ల సాధనకు ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మె చేపట్టిన గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో సమ్మెను విరమించినట్లు అలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ తెలంగాణ సర్కిల్ అధ్యక్షుడు జి. రాజేందర్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి ఎ. రవీందర్ బుధవారం రాత్రి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నలభై రోజులుగా ఆర్థిక మంత్రిత్వ శాఖ వద్ద చలనరహితంగా ఉన్న కమలేశ్ చంద్రకమిటీ నివేదిక అమలుకు తపాలా శాఖలోని అత్యున్నత స్థాయి అధికారులు ఆ మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు ప్రారంభించారన్నారు. నివేదిక అమలుకు రాతపూర్వకంగా అంగీకరించారన్నారు. వ్యాపార లక్ష్యాల గురించి బలవంతం చేయడం, వేధించడం చేయరాదని ముఖ్య అధికారులను డీజీ ఆదేశించారన్నారు. ఈవనీ నిరవధిక సమ్మె ఫలితాలేనన్నారు. సమ్మె కాలంలో సహకరించిన ప్రజలకు, ఖాతాదారులకు, అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

జూడో ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

కరీమాబాద్, న్యూస్‌టుడే: ఉర్సులోని సీఆర్సీ భవనంలో బుధవారం వరంగల్ అర్బన్ జిల్లా సబ్ జూనియర్ జూడో చాంపియన్ షిప్ పోటీలను రాష్ట్ర జూడో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టరు బండా ప్రకాశ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే జూడో అకాడమీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారు సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బైరబొయిన కైలాస్‌యాదవ్, వరంగల్ జిల్లా డీఎస్‌డీవో ధనలక్ష్మి, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, కార్పొరేటర్ మరుపల్ల భాగ్యలక్ష్మి, జూడో కోచ్ సీహెచ్. నాగరాజు, సోమరాజు, వీరస్వామి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

దేశాయిపేట: సీకేఎం కళాశాల ఎన్‌సీసీ విభాగంలో ఆధ్వర్యంలో బుధవారం క్యాడెట్ల ఎంపిక చేపట్టారు. 2017-18 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థుల్లో అర్హులైనవారిని, ఆసక్తి ఉన్నవారిని ఎన్‌సీసీ క్యాడెట్లుగా ఎంపిక చేశారు. విద్యార్థుల ఎత్తు, కంటి చూపు ఇతరత్రా పరీక్షలు నిర్వహించి ఎంపికచేశామని కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపారు. ఎన్‌సీసీ అధికారి డాక్టర్ పి.సతీష్, యశ్వంత్ సింగారె, రోహిత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వరంగల్ తూర్పు

రైల్వేస్టేషన్‌లో సీనియర్ డీసీఎం తనిఖీలు

➠ టిక్కెట్టు లేని 487 మందిపై కేసులు

➠ రూ.1,50,655 జరిమానా వసూలు



అధికారుల నుంచి వివరాలను తెలుసుకుంటున్న సీనియర్ డీసీఎం సుమిత్‌శర్మ

రైల్వేస్టేషన్ (శివనగర్), న్యూస్‌టుడే: వరంగల్ రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ డీసీఎం సుమిత్‌శర్మ బుధవారం తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున ఏసీఎం కమలాకర్, 50 మంది టీసీలు, 16 మంది ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లతో కలిసి వచ్చిన ఆయన స్టేషన్‌లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. టిక్కెట్టు లేకుండా స్టేషన్‌లోకి వచ్చేవారిని పట్టుకున్నారు. అలాగే స్టేషన్‌లో వచ్చిపోయే రైళ్లలో తనిఖీలు చేసి టిక్కెట్టు లేకుండా ప్రయాణిస్తున్న 487 మంది ప్రయాణికులనుపై కేసులు నమోదుచేశారు. వారి నుంచి రూ.1,50,655 అపరాధ రుసుంగా వసూలుచేశారు. ఆకస్మిక తనిఖీలతో ప్రయాణికులు ఆందోళన చెందారు. వరంగల్ స్టేషన్‌లో తనిఖీల అనంతరం ఆయన మహబూబాబాద్‌కు వెళ్లారు. తనిఖీల్లో సీటీఐ శ్రీనివాసరావు, స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, సీసీఐ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు

టీటీఐ కుటుంబానికి ఆర్థిక సాయం

గత జూన్‌లో అనారోగ్యంతో మృతిచెందిన టీటీఐ జి.బుచ్చిబాబు కుటుంబానికి దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ డీసీఎం సుమిత్‌శర్మ టీటీఐలు సేకరించిన రూ.60 వేల నగదును అందించారు. కార్యక్రమంలో సీటీఐ శ్రీనివాసరావు, స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

తాగునీటి వృథాపై అధ్యయనం చేయండి

కమిషనర్ శ్రుతి ఓజా



పీడబ్ల్యూసీ సంస్థ ప్రతినిధులతో చర్చిస్తున్న కమిషనర్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్ మహానగరంలో పెద్ద ఎత్తున తాగునీరు వృథావుతుంది. లీకేజీలు, అక్రమ నల్లా కనెక్షన్ల ద్వారా రోజూ 30 మిలియన్ లీటర్ ఫర్ డే నీరు వృథావుతుంది. ఇదీ ఎలా జరుగుతుంది?, దీనికి కారణాలేమిటనే దానిపై సమగ్రమైన వివరాలు ఇవ్వాలని మహా నగరపాలక సంస్థ కమిషనర్ శ్రుతి ఓజా కోరారు. బుధవారం బల్దియా కార్యాలయంలో అమృత్ పథకం ద్వారా తాగునీటి సరఫరా సర్వే కోసం నియమితులైన క్రిసల్ పీడబ్ల్యూసీ సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వేగనియంత్రణ లేకపోవడంతో నీరు వృథావుతుందని సంస్థ ప్రతినిధులు వివరించారు. తాగునీటి నాణ్యత ప్రమాణాలపై మహానగరంలో 3500 మంది నుంచి శాంపిల్స్ తీసుకున్నట్లుగా వివరించారు. వరంగల్ కమిషనర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి సమస్యలు, నీటి వృథాపై వాస్తవలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరారు. రెండు వారాల్లో పూర్తి స్థాయిలో సర్వే చేయాలన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



బాలాజీనగర్‌లో చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రమేశ్

ఎనుమాముల (కాశీబుగ్గ), న్యూస్‌టుడే: కల్యాణలక్ష్మి పథకంతో అక్కాచెల్లెళ్ల ముఖంలో ఆనందం వెల్లివిరుస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ చెప్పారు. వరంగల్ అర్బన్ పరిధిలోని పాత ఎనుమాముల, బాలాజీనగర్, సుందరయ్యనగర్‌లో కార్పొరేటర్ తూర్పాటి సులోచన ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మి పథకం చెక్కులను బుధవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆడపిల్లలున్న కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తద్వారా అక్కాచెల్లెళ్లకు ఆర్థికంగా చేయూత అందించినట్లు అవుతోందన్నారు. అనంతరం స్థానికులకు ఎమ్మెల్యే రమేశ్ ఇంటింటా చెత్త సేకరణ కోసం ప్లాస్టిక్ డబ్బాలు అందించారు. కార్యక్రమంలో వరంగల్ తహసీల్దారు రాజేశ్, వీఆర్వో ఘనపురం జడ్పీటీసీ మాజీ సభ్యుడు తూర్పాటి సారయ్య, తెరాస మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా చెట్ల తొలగింపు

కరీమాబాద్, న్యూస్‌టుడే: ఉర్సు 22వ డివిజన్ చెట్లోళ్లగడ్డ నుంచి వాటర్ ట్యాంకు వెళ్లుదారిలో ప్రమాదకరంగా ఉన్న ముళ్లచెట్ల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం స్థానిక కార్పొరేటర్ మరుపల్ల భాగ్యలక్ష్మీ ప్రారంభించారు. మహా నగరపాలక సంస్థ జేసీబీ ద్వారా పనులను ప్రారంభించి మాట్లాడుతూ రహదారిలో అడ్డుగా చెట్లు ఉండటం వలన నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అలాగే దారిలోని చెట్ల మాటున మద్యం బాబులు రాత్రివేళ మద్యం సేవిస్తున్నారని, దీంతో ఆ దారిలో వెళ్లే మహిళలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. చెట్ల తొలగింపుతో సమస్య పరిష్కారం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెరాస నాయకులు మరుపల్లరవి, గౌతమ్, సురేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజించాలి

ఏసీపీ చైతన్యకుమార్



మాట్లాడుతున్న ఏసీపీ చైతన్యకుమార్

కరీమాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజించాలని ఏసీపీ చైతన్య కుమార్ అన్నారు. బుధవారం కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో మిట్టి వినాయకుల విగ్రహాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పర్యావరణానికి ఎటువంటి కాలుష్యాన్ని ఇవ్వని మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలన్నారు. విద్యార్థులు ఈ విషయంలో అవగాహన కల్గి తమ ఇళ్లు, కాలనీల్లో మట్టి విగ్రహాలను మాత్రమే ప్రతిష్టించేలా తల్లిదండ్రులకు సూచించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, ఉపాకర్‌రెడ్డి, సుశీల్, అనితరెడ్డి పాల్గొన్నారు.

రుణాలతో ఆర్థికంగా స్థిరత్వం పొందాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీలత, సీవో రమేష్ తదితరులు

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో ఆర్థిక స్థిరత్వాన్ని పొందాలని 9వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి శ్రీలత కోరారు. బుధవారం ఏసీరెడ్డినగర్‌లోని కుసుమ రఘునాథ్ స్మారక భవనంలో రాణి రుద్రమదేవి స్లమ్ సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో పాటు తక్కువ వడ్డీతో రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాఖ్య పరిధిలో చదువుకొన్న యువత అందిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీవో ప్రవీణ్, విజయలక్ష్మి, యాకూబీ, విజయ, పుష్పలత, ఉమ, సరోజన పాల్గొన్నారు.

★ ఖిలావరంగల్ పడమరకోటలోని ముదిరాజ్ భవన్‌లో గణపతి దేవ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం 9వ వార్షికోత్సవ సభకు ముఖ్యఅతిథిగా 8వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్ విచ్చేశారు. సమావేశంలో అధ్యక్షురాలు అనంతలక్ష్మి, ఉపాధ్యక్షురాలు సావిత్రి, కార్యదర్శి రాధ, ఆర్పీ రమాదేవి, రజిత, మహేశ్వరీ పాల్గొన్నారు.

కోటను సందర్శించిన జనగామ జేసీ



జేసీ వనజాదేవికి చరిత్రను వివరిస్తున్న గైడ్ రవి

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలావరంగల్ కోట ప్రాంతాన్ని బుధవారం జనగామ జిల్లా జాయింట్ కలెక్టర్ వనజాదేవి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. మధ్యకోట కళాతోరణాల నడుమ శిల్పాలతో పాటు కుష్‌మహల్, ఏకశిలగుట్ట, స్వయంభూ దేవాలయం, రాతికోట, మట్టికోటలను తిలకించారు. కాకతీయుల చరిత్రతో పాటు కళారూపాల విషయాలను పర్యటక శాఖ గైడ్ రవియాదవ్, కేంద్ర పురావస్తుశాఖ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, సిబ్బంది వివరించారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు

శంభునిపేట (రంగశాయిపేట), న్యూస్‌టుడే: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని 8వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్ హెచ్చరించారు. బుధవారం తెల్లవారుజామున శంభునిపేటలో పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను ఆయన ఆకస్మికంగా ఆయన తనిఖీచేశారు. అనంతరం ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణపై తగిన సూచనలు చేశారు. విధులు సరిగా నిర్వర్తించని కార్మికులను మందలించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ భాస్కర్, జవాన్లు కుమారస్వామి, చరణ్ ఉన్నారు.

ఆన్‌లైన్ ఓటర్ల నమోదుపై అవగాహన



ఆన్‌లైన్ ఓటరు ప్రక్రియపై సూచనలు చేస్తున్న వీఆర్వో శ్రీనివాస్

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ఓటరు నమోదు, మృతిచెందిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియ ఆన్‌లైన్‌లో మరింత వేగంగా పూర్తిచేయాలని వరంగల్ తహసీల్దారు రాజేశ్ సూచించారు. వరంగల్ మండల కార్యాలయంలో బుధవారం బూత్ స్థాయి అధికారులకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పలు సూచనలు ఇచ్చారు. రానున్న రోజుల్లో మొత్తం ఆన్‌లైన్‌లోనే ఓటరు నమోదు ప్రక్రియ చేయాల్సి ఉంటుందని చెప్పారు. బీఎల్‌వోలు ట్యాబ్‌లను ఎలా వినియోగించాలో వివరించారు. ఆన్‌లైన్‌లోనే పేర్లు నమోదుచేయాలని, ట్యాబ్ ద్వారానే తొలగింపు, చేర్పే ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వోలు కలువల శ్రీనివాస్, కందిమల్ల స్రవంతి, అల్లం విజయ్‌జ్యోతి, సర్వేయర్లు పవన్‌కుమార్, వీఆర్‌ఏలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఉర్సు ఆసుపత్రి సందర్శన

కరీమాబాద్, న్యూస్‌టుడే: ఉర్సు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిని బుధవారం కాకతీయ మెడికల్ కళాశాల నూతన విద్యార్థులు సందర్శించారు. ఇటీవల వైద్య విద్య నేర్చుకోవడానికి కళాశాలలో చేరిన వారికి మొదట ఆసుపత్రులు, వాటి వాతావరణం, అందులో రోగులు, వ్యాధులు, యంత్రాలు ఇలా అన్ని విషయాలపై అవగాహన కల్పించడానికి కళాశాల అధికారులు ఆసుపత్రులను చూపిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉర్సు ఆసుపత్రిలోని వార్డు, థియేటర్, ఓపీ విభాగాలను వారికి చూపించి వాటి గూర్చి వివరించారు. విద్యార్థుల రాకతో ఉర్సు ఆసుపత్రి సందడిగా మారింది.

CLASSIFIEDS

YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, PAINTS, HOMEO ... BABY CARE CENTERS, IRON & CEMENT, EYE CARE, COOKING ... DELIVERY, HOME APPLIANCES, THANKS GIVING, LOST & FOUND GIFTS, COURIERS, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

BUSINESS SERVICES

BUSINESS OFFER

Setup your Own Soft Skills Franchise with Min Investment & Earn Regular Income. perfectsoftskills.in ✆ 8639637042/ 9848741400

Data Entry new projects available with good payout for long term contract. Office setup mandatory with min 5-8 systems ✆ 9849978524.

నెలకు రూ.20 వేలు పైగా ఆదాయం. ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మెషిన్లు అమ్మకం. ముడిసరుకు ఇచ్చి తయారైన సరుకు కొంటాం. సం॥ రేవతి: ✆ 91339 39828 & 91339 44327.

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారుచేయు మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు పైగా ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్. స్కై ఇంజినీరింగ్ కం॥, ఉప్పల్, HYD. ✆ 81063 70234.

ప్లాస్టిక్ పరిశ్రమ - మెషిన్లు అమ్మకం. ఇంటివద్దనే సరుకు తయారీ, ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం. నెలకు 20 వేలు పైగా ఆదాయం. 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. RJ ఎం॥ప్రై॥, ✆ 82978 57528.

FOR SALE

HNK. చౌరస్తాలోని హోటల్ ఫర్నీచర్ అమ్మబడును. Cont: 9705864281.

నర్సంపేట పట్టణంలో మేన్ సెంటర్‌లో గల జిమ్ సెంటర్ (వ్యాయామశాల) అన్ని లేటెస్ట్ పరికరాలతో అమ్మబడును. (నెలకు 50,000 సంప్రదించగలరు) లేదా లీజుకు ఇవ్వబడును. సంప్ర॥ 7661990506, 9885912122.

BUILDING & CONSTRUCTION

SEPTIC TANK CLEANING

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్.రావు Cont: 9849145043, 9866584455.

COMPUTER EDUCATION

Any Govt. Certification Course Just 500/- & Get free LTM Card (ఖాళీ సమయంలో డబ్బులు సంపాదించడం కొరకు) PGDCA, DCA, DTP, 'C', Photoshop @ Srisai Mindsoft, HNK -9866055003

EDUCATION

కేవలము 2 1/2 నెలల్లోనే ఇంటర్/ డిగ్రీ, బి.టెక్, ఎమ్.టెక్, MBA, M.Phil, P.hD పూర్తి. Eligible for Govt & Private Jobs. C/o. DSR కాలేజీ. Hnk, Cell: 9346634381.

MARRIAGE SERVICES

FUNCTION HALLS

ఓంకార్ మిని ఫంక్షన్ నందు అన్ని సౌకర్యాలతో A/C, Non A/C కలిగియున్న మిని ఫంక్షన్ హాల్ కలదు. సంప్ర: ఓంకార్ మిని ఫంక్షన్ హాల్, సుబేదారి, HNK, DIG బంగ్లా. 9160355000.

REAL ESTATE

HOUSE FOR SALE

శామీర్‌పేట దగ్గర విల్లా ప్లాట్స్ & HMDA గేటెడ్ కమ్యునిటీలో 2 BHK ఇండిపెండెంట్ ఇండ్ల ధర రూ॥ 24 లక్షలు. 80% బ్యాంక్ లోన్‌తో సేల్‌కు కలవు. స్కైవే, జీనోమ్ వ్యాలీ, Hyd. ✆ 94947 29074.

PLOT FOR SALE

యాదగిరిగుట్ట నుండి 3Km దూరంలో పెద్ద కందుకూరులో తక్కువ ధరలో ప్లాట్లు అమ్మబడును. మంచి వాస్తు & ప్లాట్లు సైజులు కలవు. బ్యాంకులోను కలదు. 040-24126888/9121797919

హన్మకొండ పోలీస్ కాలనీలోని 200 చ॥గ॥లు & 260 చ॥గ॥జాల E/F గల Plot లు అమ్మబడును. Cnt: 9392353243.

HNK, 100 Ft Road (తులసి బార్ దగ్గర) Two Sides 30 Ft Road, LRS, క్లియర్ టైటిల్ 50x45, 245 గ॥లు Square Corner ప్లాట్ అమ్మబడును. # 9700459171.

TO-LET

COMMERCIAL

HNK టైలర్స్ స్ట్రీట్‌లో 10' x 20' సైజు గల షట్టర్ - వ్యాపారాలకు/ ఆఫీసులకు / గోడౌన్‌లకు మొ॥గు వాటికి కిరాయికివ్వబడును. అడ్వాన్స్: 50k, Rent : 10k. సంప్ర॥ 9885887773, 7396100573

SITUATIONS VACANT

ఫీజులేదు Hyd లో ప్రముఖ MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకింగ్‌బాయ్స్, సూ॥వైజర్స్ కా॥ జీ: 13-18 వేలు రూం + భోజనం ఫ్రీ. ESI + PF చదువు లేకున్నా జాబ్, ✆ 7330250599.

Wanted Experience Staff Nurse For Hospital. Cell No: 7680071974

హైదరాబాద్‌లోని ఇళ్లల్లో 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 7032025222.

Hyd లో గల ప్రముఖ లిమిటెడ్ కంపెనీలకు హెల్పర్స్, ప్యాకర్స్, సూ॥వైజర్స్, B.Sc కెమిస్ట్రీ, ITI ఆల్‌ట్రేడ్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 10,000/- to 16,000/- (రూం+మీల్స్ సౌకర్యం) ✆ 9705549598/ 9553632447

హన్మకొండలో గల ప్రముఖ ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపులో వర్క్ చేయుటకు Photoshop డిజైనర్ కావలెను. అనుభవంగల వారికి జీతం: 10,000/- లు. సంప్ర॥ 9177455451, 8522023535.

హాస్టల్లో పనిచేయుటకు పనిమనుషులు (నలుగురు ఆయాలు, చాకలి) వారు కావలెను. భోజనం, వసతి ఉచితం. లిబర్టీ స్కూల్, జాకారం, ములుగు. సంప్ర॥ 9603009916, 9912839747.

శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్ నందు మార్కెటింగ్ చేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. అ: డిగ్రీ, జీ: 10-15 వేలు. సంప్ర॥ 9959491774, 9392389113.

బాలసముద్రం ఇంటిలో పనిచేయుటకు పనివారు కావలెను. భార్యాభర్తలకు వసతి. పిల్లలకు చదువు ఉచితం. జీతం: 5000 + 5000. Call: 8006061234, 9885552497.

HYD 5 Star Hotels లో ఫిలింస్టార్స్ ఫుడ్ సర్వీస్‌కై క్యాటరింగ్ బాయ్స్ & హెల్పర్స్ కావలెను. వ॥ 18-30, రూం + మీల్స్ ఫ్రీ. జీ:12000 - 14500 ✆ 8885200700

HNK, HYD. లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: HNK, 12000; HYD, 13500. + ESI, PF సౌకర్యం కలదు. సం॥ 9393599119.

Wgl, Hnk, Kzp లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, పెట్రోల్ పంపులో ఫిల్లర్స్, హౌస్ కీపింగ్, మార్కెటింగ్‌కు స్త్రీ, పురుషులు కావలెను. 7075082144.

రైతు బిడ్డలకు శుభవార్త! తమ ఊరిలో ఉంటూ WHO సర్టిఫైడ్ ఆర్గానిక్ గ్రోత్ బూస్టర్ (అన్ని రకముల పంటలకు బలం మందు) ప్రమోటర్స్ కావలెను. అర్హత: 8వ తరగతి ఆపై. జీ॥ 8,000 - 16,000/- (TA+DA). 8341634164.

FACULTY / TEACHERS

Wanted English Teacher to Teach upto X Class. Salary 16000, Liberty High School, Jakaram, Mulugu, 9603009916, 9912837515.

Wanted Teachers. ★ English (High School) (VI-X) ★ Ayahs. ★ Contact Immediately 9666025025. Avanthi High School, Hunter Road, Hnk.

గణేశ్ నవరాత్రులకు అప్రమత్తతే ప్రధానం

పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు



మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రుల ఉత్సవాలలో పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు సూచించారు. బుధవారం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీలు, ఏసీపీలతో సమావేశం నిర్వహించారు. గణపతి ఉత్సవాలకు పోలీసుశాఖ ద్వారా చేపట్టిన బందోబస్తు, నిమజ్జన కార్యక్రమాలకు తీసుకుంటున్న చర్యలపై పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి గణపతి మండపాలను పర్యవేక్షించడంతోపాటు మండపం ఏర్పాటుకు సూచనలను అందించాల్సి ఉంటుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గణేశ్ మండపాలకు పోలీసు సిబ్బంది ఇన్‌ఛార్జులను నియమించడంతో పాటు పగలు, రాత్రి సమయంలో వీలైనంత మేరకు పాట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. ప్రజల నుంచి ఏదైన ఫిర్యాదు వస్తే వెంటనే స్పందించాలన్నారు. గణపతి మండపాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసుకునేందుకు నిర్వాహకులతో చర్చించాలన్నారు. నగరంలోని పద్మాక్షిగుండం, కోట చెరువు, బంధం చెరువు, చిన్నవడ్డేపల్లి, ఉర్సు, కట్టమల్లన్న చెరువుల్లో నిర్వహించే నిమజ్జనం సమయంలో క్రేన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణేశ్ విగ్రహాలను తరలించే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు లైన్లను పరిశీలించాలన్నారు. ఏదైన సమస్య ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసుస్టేషన్ల వారీగా ఆర్టీసీ మెకానిక్‌లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఉత్సవ కమిటీలు డీజే సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటుకు అనుమతించవద్దన్నారు. గణపతి నవరాత్రుల నిమజ్జన కార్యక్రమం బందోబస్తులను వ్యక్తిగత శ్రద్ధతో పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. ఈసమావేశంలో డీసీపీలు వేణుగోపాల్‌రావు, వెంకన్న, ఇస్మాయిల్,ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో తిరుగువారం పూజలు

తాడ్వాయి, న్యూస్‌టుడే: వన దేవతలు సమ్మక్క, సారలమ్మకు సంబంధించిన తిరుగువారం పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 16న దేవతలకు పూజారులు పొట్ట పండగ నిర్వహించిన సంగతి తెల్సిందే. పొట్టపండగకు కొనసాగింపుగా పూజారులు దీన్ని నిర్వహించారు. పొట్టపండగ విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈ ఉత్సవాన్ని పూజారులు సంప్రదాయ రీతిలో నిర్వహించారు. మేడారం, కన్నెపల్లిలలోని సమ్మక్క, సారలమ్మ దేవతల పూజామందిరాలను శుభ్రం చేశారు. దేవతల పూజాసామగ్రిని శుభ్రం చేసి దేవతలకు ధూప, దీప ఇష్ట నైవేద్యాలను సమర్పించారు. కుటుంబాల సమేతంగా పూజామందిరాలకు వచ్చి పండగను విజయవంతంగా నిర్వహించే శక్తిని ప్రసాదించిన దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. వచ్చే జాతరకు తమకు శక్తిని ప్రసాదించాలని వేడుకున్నారు. బుధవారం ఉదయం ప్రారంభమైన ఈ పూజలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. కార్యక్రమంలో పూజారులు సిద్దబోయిన మునీందర్, లక్ష్మణ్‌రావు, స్వామి, కాక సారయ్య, కిరణ్‌కుమార్, కొక్కెర కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



సిద్ధం చేసిన పూజ సామగ్రి



ఆలయం ముందు ముగ్గులు వేస్తున్న పూజారి సతీమణి

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

పర్వతగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతుందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్‌తో కలిసి శ్మశాన వాటిక నిర్మాణ పనులను ప్రారంభించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించడంతో పాటు జిల్లా పరిషత్తు పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ శ్మశానవాటిక పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలందజేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని అభివృద్ధి పనులు ప్రస్తుత తెరాస ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ఏఎంసీ వైస్ ఛైర్మన్ జితేందర్‌రెడ్డి, ఎంపీపీ రంగు రజిత, జడ్పీటీసీ సభ్యురాలు శైలజ, పర్వతగిరి, కల్లెడ సర్పంచి విజయలక్ష్మి, శ్రీనివాస్, తెరాస మండల అధ్యక్షుడు రాతన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీ పేరుతో కొత్త నాటకం

తెరాస ప్రభుత్వంపై పొన్నాల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

రంగంపేట, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అబద్ధాలు, అసత్యాలతో కూడిన ప్రసంగాలు చేశారని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ పేరుతో కొత్త నాటకం మొదలు పెట్టారన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం ఇస్తానని నమ్మబలికి, మూడేళ్లు దాటినా ఇంతవరకు అమలు చేయలేదని, 84 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కొత్తగా చెబుతున్నా మూడేళ్లలో చేయలేనిది ఆర్నెల్లలో ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. నేషనల్ పోలీస్ అకాడమీకి 2013లోనే కాంగ్రెస్ ప్రభుత్వం దివంగత వెంకట్రామిరెడ్డి పేరును పెట్టగా తెలంగాణ పోలీస్ అకాడమీకి ఆయన పేరును తానే పెట్టానని ముఖ్యమంత్రి మాట్లాడటం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలో 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను దశల వారీగా క్రమబద్ధీకరణ చేయాలని నిర్ణయించి తొలి, రెండో దశలు పూర్తయ్యే సమయానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెరాస అధికారంలోకి వచ్చాక మూడో విడత క్రమబద్ధీకరణ చేశామని, అయితే అవన్నీ తామే చేసినట్లుగా సీఎం అబద్ధాలు మాట్లాడటం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ పురస్కారం ఎందుకు ప్రకటించారో ఎవరికీ అర్థం కావడం లేదని, రైతుల ఆత్మహత్యలు, ఏకకాలంలో రుణమాఫీ, మద్దతు ధర ఇవ్వలేదని, వ్యవసాయ రంగాన్ని నాశనం చేసిన సీఎంకు కేంద్రం పురస్కారం ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత పాలకుల వల్లే హైదరాబాద్ అభివృద్ధి చెందలేదని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందని, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటరు రింగురోడ్డు, మెట్రోల్ రైలు ప్రాజెక్టు కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయన్నారు. మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ మహా నగరాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం కేసీఆర్ అన్నా 2013లో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను మూడేళ్ల పాటు అమోదించకుండా ఎందుకు జాప్యం చేశారని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ ఆధునిక మాస్టర్ ప్లాన్ అంటూ కొత్తది తయారు చేయాలన్నారు. 1972లో మాస్టర్‌ప్లాన్ నిబంధనలు అమలుచేయడం వల్ల నగర ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరోగ్యం, పీసీసీ ప్రధాన కార్యదర్శి నమిండ్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజనాల శ్రీహరి, పీసీసీ కార్యదర్శులు ఈవీ.శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్, అమృతరావు, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో అంగన్‌వా'డీలా'

☛ అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలు

☛ ఆరోగ్య కిట్లు, శౌచాలయాలు లేక చిన్నారుల ఇబ్బందులు



ముల్కనూర్‌లో అసంపూర్తి ఉన్న అంగన్‌వాడీ భవనంలో చిన్నారులు

న్యూస్‌టుడే, భీమదేవరపల్లి: మూడేళ్లు నిండిన చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి శిశు మరణాలు సంభవించకుండా ఆట-పాటలతో విద్యాబోధన అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సమగ్ర శిశు, సంరక్షణ కేంద్రాల పరిస్థితి అధ్వానంగా ఉంది. అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగింపు, మౌలిక వసతులు లేక ఆశించిన స్థాయిలో స్పందన లేక అస్తవ్యస్తంగా మారింది. కేంద్రాల్లోని చిన్నారులకు మౌలిక వసతులు పూర్తిగా లోపించడంతో రోజురోజుకు కేంద్రాలకు వచ్చేందుకు విముఖత చూపుతున్నారు. అర్బన్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శౌచాలయాలు, మెడికల్ కిట్లు అందుబాటులో లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్న వైనంపై 'న్యూస్‌టుడే' కథనం..

అర్బన్ జిల్లాలో ఇదీ పరిస్థితి..

వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో వరంగల్ అర్బన్, హన్మకొండ అర్బన్, భీమదేవరపల్లిలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. భీమదేవరపల్లి ప్రాజెక్టు పరిధిలో 232 కేంద్రాల్లో 78 అద్దె భవనాల్లో కొనసాగుతుండగా 77 కేంద్రాలను సర్కార్ పాఠశాలల్లో విలీనం చేశారు. వరంగల్ అర్బన్‌లో 296 కేంద్రాల్లో 195 అద్దె భవనాల్లో ఉండగా 31 వాటిని విలీనం చేశారు. హన్మకొండ రూరల్‌లో 271 కేంద్రాల్లో 238 అద్దె భవనాల్లో ఉండగా 29 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేశారు. భీమదేవరపల్లి మండలంలో ఆరు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 12 కేంద్రాలు సమీప ప్రభుత్వ పాఠశాలలకు మార్చారు. మండలంలోని ముల్కనూర్, మాణిక్యాపూర్, రత్నగిరి, రంగయ్యపల్లి, మల్లారం, భీమదేవరపల్లి తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేయగా అక్కడ గదులు సరిపోక నిత్యం చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మాణిక్యాపూర్ ప్రాథమిక పాఠశాలలో మూడు గదులు ఉండగా ఒకటి అంగన్‌వాడీ కేంద్రానికి ఇస్తే పిల్లలు ఆరుబయట ఉండాల్సిన పరిస్థితి ఉంది. ముల్కనూర్‌లో నాలుగు కేంద్రాలను సర్కార్ బడిలో కలుపగా గదులు సరిపోక అసంపూర్తి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్నారు. తల్లిదండ్రులు ఆందోళన చేయడంతో తిరిగి అద్దె భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అత్యధిక కేంద్రాల్లో శౌచాలయాలు లేవు, విద్యుత్తు సౌకర్యం లేదు. ధర్మారం గ్రామంలో పాఠశాల ఆవరణలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. గదిలోపల పందికొక్కులు బండరాళ్లు లేపడంతో అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు.



గది లోపల అస్తవ్యస్తంగా ఉన్న బండలు

పిల్లల రక్షణ పట్టదా..?


అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో విద్యా, పౌష్టికాహారం అందిస్తున్నారు. లక్ష్యం మంచిదైనా అంగన్‌వాడీ కేంద్రాలకు వసతులు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ప్రి స్కూళ్ల పేరుతో ఆర్భాటం చేస్తున్న ప్రభుత్వం చిన్నారులకు అవసరమైన మెడికల్ కిట్లపై దృష్టి సారించడం లేదు. కేంద్రాల్లో మల, మూత్ర విసర్జనలకు శౌచాలయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. సమీపంలోని బోర్ల వద్ద, ఊట గుంతల వద్దకు వెళ్లి పలు జిల్లాలో చిన్నారులు ప్రమాదాల బారిన సంఘటనలు ఉన్నాయి. విద్యుత్తు సదుపాయాలు లేక ఫ్యాన్లు ఏర్పాటు చేయక ఇరుకు గదుల్లో చిన్నారులు మగ్గుతున్నారు. శాశ్వత భవనాలు లేక అద్దెభవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి దయనీయంగా మారింది. చిన్నారులు ఆటలాడుతూ పడిపోయి గాయాలపాలైతే ప్రాథమిక చికిత్స అందించే అవకాశం కూడా లేకుండా పోయిందని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులకు గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండేవి. ఏడాది కాలంగా కేంద్రాల్లో ఆరోగ్య కిట్లు లేవు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాల బాలికలు పుట్టిన వెంటనే బరువు కొలిచి ఎదుగుదలను రికార్డుల్లో నమోదు చేయాలి. కొన్ని కేంద్రాల్లో బరువు తూకం యంత్రాలు పని చేయకపోవడంతో కార్యకర్తలు అంచనాలతో చిన్నారుల బరువు నమోదు చేస్తుండటం గమనార్హం.

సదుపాయాలు కల్పిస్తాం



– శైలజాకుమారి, జిల్లా సంక్షేమ అధికారి, అర్బన్ జిల్లా

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతాం. పక్కా భవనాలు లేని కేంద్రాలను గుర్తించి మంజూరు నిమిత్తం ప్రతిపాదనలు పంపాం. పలు చోట్ల పక్కా భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. పిల్లలు తక్కువ ఉన్న కేంద్రాలను సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశాం. జిల్లాలో 16 ప్రభుత్వ పాఠశాల ఆవరణల్లో పక్కా భవనాల నిర్మాణాలకు స్థలం పరిశీలించాం. పాఠశాలలో మౌలిక వసతులు లేనిచోట కల్పించేందుకు చర్యలు చేపడుతాం. ఆరోగ్య కిట్లకు టెండర్ నిర్వహించి కేంద్రాలకు సరఫరా చేస్తాం.



ధర్మారంలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రం

భార్యను కొట్టి.. భర్త ఆత్మహత్య



దేవేందర్ (పాతచిత్రం)

వడ్డేపల్లి, వరంగల్ క్రైం, న్యూస్‌టుడే : భార్య తలపై రాడ్డుతో బాది తీవ్రంగా గాయపరిచి, భర్త ఉరి వేసుకున్న సంఘటన బుధవారం వరంగల్ అర్బన్ జిల్లా వడ్డేపల్లిలోని ముదిరాజ్‌వాడలో చోటు చేసుకుంది. గత కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా మతిస్థిమితం కోల్పోయిన మట్టెపల్లి దేవేందర్ తన భార్య శ్రీదేవితో బుధవారం ఉదయం గొడవపడి ఆమె తలపై బలంగా రాడ్డుతో బాదడంతో తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిపోయింది. భయభ్రాంతికి గురైన దేవేందర్ ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకొన్నాడు. చుట్టుపక్కల వారు 108కు సమాచారం అందించడంతో తీవ్ర రక్తస్రావంతో కొట్టుమిట్టాడుతున్న శ్రీదేవిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటికే ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకున్న దేవేందర్ చనిపోయారు. అనంతరం దేవేందర్‌ను కూడా ఎంజీఎం ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం పూర్తి చేశారు. క్షణికావేశంలో ఘర్షణ పడి ప్రాణాలు పోగొట్టుకోవడంతో వడ్డేపల్లిలోని ముదిరాజ్‌వాడలో విషాదం చోటు చేసుకుంది. కుమారుడు రేవంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సుబేదారి ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

జూలైవాడ, న్యూస్‌టుడే : ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి నెల డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గురువారం హన్మకొండ లోకల్ డిపో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, జిల్లాలోని హన్మకొండ, హసన్‌పర్తి, ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, సంగెం, ఐనవోలు, కాజీపేట, తదితర మండలాలోని ప్రయాణికులు వారి సలహాలను, ఫిర్యాదులను ఫోను ద్వారా ఉదయం 11 నుంచి 12 గంటల వరకు తెలియజేయాలని హన్మకొండ లోకల్ డిపో మేనేజర్ అర్పిత ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్ నెంబర్ 73828 26049, 99592 26049లలో తెలియజేయాలని ఆమె కోరారు.

ఎన్‌ఎస్‌జీ, ఆక్టోపస్ సంయుక్త విన్యాసం



భద్రతపై డెమో ఇచ్చేందుకు సిద్ధమైన సిబ్బంది

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ రూరల్ జిల్లా దామెర మండలంలోని ఒగ్లాపూర్, ఉరుగొండ గ్రామాల మధ్యలోని పవర్‌గ్రిడ్‌లో బుధవారం రాత్రి ఎన్‌ఎస్‌జీ కమోండోలు, తెలంగాణ ఆక్టోపస్ పోలీసులు సంయుక్తంగా భద్రత చర్యలపై డెమో ప్రదర్శించారు. పవర్‌గ్రిడ్‌లపై తీవ్రవాదులు, ఇతర అసాంఘిక కార్యక్రమాలను పాల్పడేవారు దాడులు చేసే సమయంలో అక్కడ ఉన్న సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కమోండోలు పలు విన్యాసాలను ప్రదర్శించారు. ఎత్తైన గోడలను సులువుగా ఎక్కడం ఎదురుగా వచ్చే శత్రువులను మట్టుబెట్టడం, వారిని ఎలా ఎదుర్కోవాలే అనే అంశాలపై ప్రదర్శన ఇచ్చారు. సుమారు రెండు గంటలపాటు ప్రదర్శన కొనసాగింది. జాతీయ భద్రత సిబ్బంది, ఆక్టోపస్ పోలీసులు సమన్వయంతో పని చేస్తూ ప్రదర్శన ఇచ్చారు. ఇతరులను ఎవరిని లోపలకు అనుమతించలేదు. పవర్‌గ్రిడ్ భద్రత కోసం ఇలాంటి డెమోలను ఇస్తారని పోలీసు అధికారులు తెలిపారు.

ప్రతి విద్యార్థి విజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

☛ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

☛ ముగిసిన ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో సైన్స్ విజ్ఞానాన్ని అలవర్చుకొని అబ్దుల్‌కలాంలా జాతికి వన్నె తేవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కోరారు. బుధవారం హంటర్‌రోడ్డులోని ప్రాంతీయ సైన్స్ కేంద్రంలో జరిగిన ఆరు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం ప్రాజెక్టు అధికారి డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. సైన్స్ కేంద్రం అభివృద్ధికి తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కేంద్రం ద్వారా ప్రతి నెల ఒక కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్లయితే తగిన నిర్వహణ ఖర్చులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రంలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి కృషి చేస్తున్నందున ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఐటీ మంత్రి కేటీఆర్ రాష్ట్రంలో సాంకేతిక పరిశ్రమలు నెలకొల్పేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కుడా ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి మాట్లాడుతూ. . గిరిజన ప్రాంతాల నుంచి శిక్షణ పొందిన విద్యార్థిని, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో అభివృద్ధి చెందాలన్నారు. ఈ సైన్స్ సెంటర్‌కు 'రోప్ వే' ఏర్పాటు చేస్తే భారతదేశంలోనే మొదటి సైన్స్ సెంటర్ అవుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మాధవిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండి రజినికుమార్, సైన్స్ సెంటర్ సభ్యుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. శిక్షణలో భాగంగా కాకతీయ మెడికల్ కళాశాలను రిసోర్స్ పర్సన్స్ శ్యాంసుందర్‌రెడ్డి నేతృత్వంలో విద్యార్థులు సందర్శించి పలు అంశాలపై అవగాహన పెంపొందించుకున్నారు.

నేటి చికెన్ ధరలు



కిలో వెల రూపాయలలో

	వెన్‌కాబ్	సుగుణ
ఫారం	82	82
హోల్‌సేల్	-	-
లైవ్ రిటైల్	97	97
డ్రెస్డ్ స్కిన్‌తో	136	141
స్కిన్‌లెస్	160	165

సుగుణ : 93479 48884, 93464 02116

వెన్‌కాబ్ : 98492 19870 న్యూస్‌టుడే, కాజీపేట

రేపటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

వేయిస్తంభాల దేవాలయంలో ఏర్పాట్లు



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

హన్మకొండచౌరస్తా, న్యూస్‌టుడే: హన్మకొండ చరిత్రాత్మక రుద్రేశ్వర వేయి స్తంభాల దేవాలయంలో 25 నుంచి 2వ తేదీ వరకు వినాయక చవితి సందర్భంగా శ్రీ మహాగణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. బుధవారం దేవాలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ సూచనల మేరకు దేవాలయంలో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠిస్తామన్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం మహాగణపతిని ఊరేగింపుగా తీసుకొచ్చి వైభవంగా ప్రతిష్ఠిస్తామన్నారు. దేవాలయ అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో సహకరిస్తున్నాయని, హృదయ్ పథకంలో రూ.5 కోట్లు నిధులు కేటాయించారన్నారు. కల్యాణ మండపానికి రూ.1.60 కోట్లు నిధులు వెచ్చిస్తున్నారని అన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేందర్‌రావు మాట్లాడుతూ.. దేవాలయంలో 49వ సారి మహాగణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో 39వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు, ధాతలు పాల్గొన్నారు. అనంతరం నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. స్థానిక కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అందుకుంటూ గిన్నిస్ రికార్డు

నిమిషం వ్యవధిలో 81 దేశాల పటాలు గుర్తిస్తున్న 'చిరుతేజ'ం



తొలి గురువు తల్లి అంటారు.. ఈ నానుడి అక్షర సత్యం.. తన కూతురులోని సూక్ష్మ దృష్టి, మేధస్సును గుర్తించిన ఆ అమ్మ.. చిన్నారిలోని ప్రజ్ఞకు మరింత పదును బెట్టి ప్రపంచ స్థాయి రికార్డును సాధించే దిశగా వెన్నుతట్టి ప్రోత్సహించింది. చిరుప్రాయంలోనే గిన్నిస్ బుక్ రికార్డు అందుకునేలా ఆ చిన్నారిని నిమిషానికి 81 దేశాల పటాల గుర్తింపులో సఫలీకృతం అయ్యేలా శిక్షణ ఇచ్చింది. ఇక అందుకో వటమే తరువాయి అన్న రీతితో ఆ చిన్నారి మరింత సాధన చేస్తోంది. మహబూబాబాద్ పట్టణానికి చెందిన నాలుగో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల వయసు కలిగిన గిరిజన విద్యార్థిని భూక్యా చిరుతేజ్ సింగ్ రాథోడ్ చేస్తున్న కృషి, ఆ చిన్నారికి లభిస్తున్న ప్రోత్సాహంపై 'న్యూస్‌టుడే' స్ఫూర్తిదాయక కథనం.

–మహబూబాబాద్, న్యూస్‌టుడే

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీటీఆర్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయులైన భూక్యా కిరణ్‌సింగ్- వసంత దంపతులకు ఇద్దరు కూతుళ్లు. వారి రెండో కూతురే చిరుతేజ్‌సింగ్. ఎనిమిదేళ్ల వయసున్న ఈ చిన్నారి మూడో తరగతిలోనే సాంఘిక శాస్త్రంలోని భారత దేశం భౌగోళిక పటంలో అవుట్‌లైన్‌లో ఉన్న అన్ని దేశాల పేర్లను సులువుగా గుర్తిస్తుంటే ఆమె తల్లి పసిగట్టింది. తన కూతురులోని ప్రజ్ఞను పరిశీలించిన తల్లి వసంత తనయురాలి మేధస్సుకు మరింత పదును పెట్టాలని భావించింది. ఈ సమయంలోనే 'ఈనాడు'లో ప్రచురితమైన ఓ కథనం ఆమెను విశేషంగా ఆకర్షించింది. మహబూబాబాద్‌కు చెందిన ఉపాధ్యాయుడు చింతకుంట్ల కుమారస్వామి ఐదు నిమిషాల వ్యవధిలో ప్రపంచ పటాన్ని గీసి అందులోని ఆసియా ఖండంలో ఉన్న దేశాలను గుర్తించిన వైనం ఆ చిన్నారిని కూడా ఆకట్టుకుంది. దీంతో తాను కూడా రికార్డులు సాధించాలనే తపనతో ఉన్న ఆ చిన్నారి ఆ దిశగా అడుగులు వేసింది. తన తల్లి సహాయంతో ప్రపంచ భౌగోళిక పటంలో ఒక్కొక్క ఖండాన్ని వాటిలో ఉన్న దేశాలను గుర్తించింది. ఇలా ఐదు రోజుల వ్యవధిలోనే ప్రపంచ భౌగోళిక పటంలో ఉండే చిన్న చిన్న దేశాలతో సహా 236 దేశాల ఉనికిని రకీమని చెప్పే విధంగా గుర్తు పెట్టుకుంది.

పాఠశాలలోనే తొలి ప్రదర్శన

మహబూబాబాద్‌లో తను చదువుతున్న పాఠశాలలోనే తొలి ప్రదర్శన ఇచ్చింది. మూడో తరగతి చదువుతున్న చిరుతేజ్ సింగ్‌కు అప్పుడు ఎనిమిదేళ్ల వయస్సే. పది నిమిషాల్లోనే ప్రపంచ దేశాలు వాటి ప్రాముఖ్యత, నదులు, సముద్రాల ఉనికిని గుర్తించడం, భారతదేశంలోని రాష్ట్రాలు, వాటి రాజధానులు, రాష్ట్రాల ప్రాముఖ్యతను వివరించి ఉపాధ్యాయులను కూడా ఆశ్చర్యపరిచింది. తొలి ప్రదర్శనకు ప్రశంసలు అందడంతో మరో అడుగు ముందుకు వేసింది. తక్కువ సమయంలో ఎక్కువ దేశాలను గుర్తించడంపై గురిపెట్టింది. గతంలో ఉన్న రికార్డులను తన తల్లి దండ్రుల సాయంతో గూగుల్‌లో శోధించి తెలుసుకున్న చరణ్ తేజ్ సింగ్ వివిధ రికార్డుల సాధన కోసం కృషి నారంభించింది.


సాధించిన రికార్డులు ఇలా..

- లిటిల్ బుక్ ఆఫ్ రికార్డు
- బుక్ ఆఫ్ స్టేట్ బుక్ ఆఫ్ తెలంగాణ రికార్డ్సు
- స్టార్ వరల్డ్ రికార్డు
- మూడు నిమిషాల వ్యవధిలోనే వరల్డ్ అవుట్ లైన్ మ్యాపులో గుర్తించిన రికార్డు
- 2017 ఫిబ్రవరి 13న జిల్లా కలెక్టర్ ప్రీతిమీన అధ్యక్షతన మహబూబాబాద్‌లో నిర్వహించిన 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' ప్రదర్శనలో రెండు ప్రపంచ రికార్డులను నమోదు చేసుకుంది. ఒక్క నిమిషంలోనే ప్రపంచ భౌగోళిక పటం నుంచి 88 దేశాలను అతివేగంగా గుర్తించినట్లు దిల్లీకి చెందిన న్యాయ నిర్ణేత మనిష్ విష్ణోయ్ పర్యవేక్షణలో రికార్డు నమోదు చేశారు. అతి స్వల్ప వ్యవధిలో 2.38 నిమిషాల్లో వేగంగా 236 దేశాల గుర్తించినట్లు మరో రికార్డు సొంతం చేసుకుంది.
- 2017 ఫిబ్రవరి 19న హైదరాబాద్‌లోని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో ఒక్క నిమిషంలోనే 125 దేశాలను గుర్తించింది. న్యాయనిర్ణేతగా వ్యవహరించిన వసుధ అశోక్ నుంచి రికార్డును అందుకుంది.



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాన్ని అందుకుంటున్న చిరుతేజ్(పాత చిత్రం)

మట్టి గణనాథులనే పూజిద్దాం



పర్యావరణ హితులమవుదాం

చిన్నారులు మొదలు పెద్దలు దాకా అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా చేసుకునే ఆనంద వేడుక వినాయక చవితి. ఈ పండగంటేనే ప్రకృతిని పూజించటం. వివిధ రకాల పత్రాలతో గణనాథుని పూజిస్తుంటాం. విఘ్నేశ్వరుని ప్రతిమను కూడా పర్యావరణహితంగా ప్రతిష్ఠించుకుంటే మేలనేది అందరి అభిమతం. తదనుగుణంగానే అనేక రాష్ట్రాల్లో వివిధ ఆకారాలు, రూపాల్లో మట్టి విఘ్నేశ్వరులను ప్రతిష్ఠించి పూజించడం చేస్తున్నారు. మన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఇదే విధమైన విజ్ఞప్తి చేశారు. తాజాగా కేంద్ర రసాయన, ఎరువులు, పార్లమెంటు వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ సైతం మట్టి గణనాథులను పూజించమని భక్తులకు విన్నవించారు. ఇంతమంది పెద్దలు, పూజ్యులు చెబుతున్న బాటనే మనం కూడా నడవాల్సిన అవసరం ఉంది. పర్యావరణ హితం కాంక్షిస్తూ వివిధ ప్రాంతాల్లో చవితి ఏర్పాట్లు ఎలా చేస్తున్నారో..'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, డోర్నకల్

పీవోపీ విగ్రహాల తయారీపై నిషేధం




కర్ణాటక

పర్యావరణానికి విఘాతం కలిగించే ఎలాంటి చర్యనైనా కర్ణాటక ప్రభుత్వం తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఖానాపూర్ తాలూకాలో ఈసారి ప్లాస్టర్ పారిస్ ఆఫ్ (పీవోపీ) విగ్రహాల తయారీపై పూర్తి స్థాయిలో నిషేధం విధించింది. పర్యావరణ అనుకూల విగ్రహాల తయారీకే అనుమతిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. విగ్రహాల తయారీకి ఉపయోగించే మట్టి ఈ తాలూకాలో సమృద్ధిగా లభ్యమవుతుండటంతో ప్రభుత్వం ఇక్కడ వీటి రూపకల్పనకు మొగ్గు చూపింది. ప్రభుత్వ నిర్ణయంతో 300 మంది గ్రామీణ కళాకారులకు ఉపాధి లభించింది. వీరందరూ ఒకే గొడుగు కింద మట్టి గణనాథులను తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారైన విఘ్నేశ్వరుని విగ్రహం ఏ ప్రాంతంలో కొనుగోలు చేసినా ఒకే ధరకు లభించే సదుపాయం కల్పించారు. ఖానాపూర్ తాలూకా పరిధిలోని గురుగ్గుంజి, నగర్గలి, నందగడ్ గ్రామాలు మట్టి విగ్రహాల తయారీకు మొదటి నుంచి పెట్టింది పేరు. ఇక్కడి విగ్రహాల కొనుగోలుకు గోవా నుంచి ముందస్తు ఆర్డర్లు రావడం చూస్తే పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లోను ఆదరణ ఉందనే విషయం తేటతెల్లమవుతుంది. రూ.1200 నుంచి గరిష్ఠంగా రూ.5 వేలు వరకు ధర ఉంటుంది. ప్రభుత్వ చర్యను పీవోపీ విగ్రహ తయారీదారులు ప్రతిఘటించే ప్రయత్నం చేసినా వారి పప్పులేం ఉడకలేదిక్కడ.

పొరుగు రాష్ట్రాల బాట అనుసరణీయం

ప్లాస్టిక్ సంచుల వాడకంపై కట్టడి



ఉత్తర్‌ప్రదేశ్

ఉత్తరప్రదేశ్‌లో ఇది పేరొందిన ఆశ్రమం. ఇక్కడ వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకోవడానికి అధిక ప్రాధాన్యమిస్తారు. సాయి ఆశ్రమం నిర్వాహకులు మట్టి గణనాథులను ప్రతిష్ఠించి నిత్య పూజలు, ఆరాధనలు ఉంటాయి. పర్యావరణ పరిరక్షణ గూర్చి భక్తులను చైతన్య పరుస్తుంటారు. విఘ్నేశ్వరుని మండపం వద్దకు పూజా సామగ్రి, ఇతర వస్తువులు తీసుకుని రావడానికి ప్లాస్టిక్ సంచులు అనుమతించరు. ఒకవేళ తెలిసీ తెలియకో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధించి ఆ మొత్తాన్ని వారి చేతులతో అక్కడే హుండీలో వేయిస్తారు. దీంతో ప్లాస్టిక్ సంచుల వినియోగం మానేశారక్కడ.

రెండో ఆలోచనకు తావివ్వరు



గోవా

పర్యావరణ హితానికి పెట్టింది పేరు గోవా. ఇక్కడ ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనైనా రెండో ఆలోచనకు తావివ్వరు. వినాయక చవితిని 'ఛావత్' పేరిట పాటిస్తారు. వేరొకరి చేత చెప్పించుకోరు. ఎవరికి వారు మట్టి గణనాథులనే ప్రతిష్ఠించి పూజలు చేస్తుంటారు. వివాహిత మహిళలు విధిగా రెండున్నర రోజులు ఉపవాసం పాటిస్తారు. విఘ్నేశ్వరుడితో పాటు గౌరీ, మహాదేవ్ ప్రతిమలను పూజించడం ఇక్కడి ప్రత్యేకత. కాగితంపై గౌరీ చిత్రపటం గీసి టెంకాయని శివుడిగా పరిగణిస్తారు. పర్యావరణం పరిరక్షణ ఆవశ్యకత గూర్చి ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి గౌరీ, మహాదేవ్, గణపతి రూపాలు పోలిన ఆకులను సేకరించే పని బాలికలకు అప్పగిస్తారు. ఒక విధంగా వారికిది పోటీ.


ఆవు పేడ గణేశులకు ఆదరణ



మహారాష్ట్ర

మునుపెన్నడూ లేని విధంగా ఇక్కడ ఈసారి ఆవు పేడతో తయారు చేసిన గణేశ్ విగ్రహాలకు ఆదరణ లభిస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే ఇవే ప్రాచుర్యం పొందాయి. ఛో ఆశ్రమం నడుపుతున్న నేరుల్ వాసి నీలేశ్ టుపే అనే వ్యక్తి ఆలోచనకు ప్రతిరూపం ఈ తరహా ప్రతిమలు. ఇతను తనకు అవసరమైన ముడి సరకుని రాజస్థాన్‌లోని గోశాలల్లోంచి సమకూర్చుకుంటున్నారు. ముంబై కేంద్రంగా ఆవు పేడ గణనాథుల అమ్మకాలకు ప్రధాన పంపిణీదారుడి అవతారమెత్తారు. స్నేహితుల ప్రోద్బలంతో టుపేలో ఈ మేలుకొలుపు సాధ్యమైంది. ఆవు పేడ గణనాథులను ఎంచక్కా ఇంటి ఆవరణలోనే నిమజ్జనం చేసుకునే వీలుంది..

బొజ్జలో విత్తనాలతో గణపయ్య ప్రతిరూపం



ముంబయి

దేవుడు అంతటా ఉన్నారనే ఆలోచనను ఆచరణలో పెట్టి నిరూపించాలనే ఆలోచన చేశాడు ముంబయికి చెందిన దత్తాద్రి కొఠూర్. ఇతను ఒక సంస్థలో సీనియర్ ఆర్ట్ డైరెక్టర్. గణనాథుడిని నీటిలో నిమజ్జనం చేయడమే కాదు గణనాథుడిపైనా నీటిని పోయడం ద్వారా కూడా నిమజ్జనం చేయొచ్చనేది ఇతని సంకల్పం. దీనికితోడు ఇంకేదైనా ప్రయోజనం ఒనగూరితే బాగని తలచాడు. వెంటనే బొజ్జతోపాటు తొండంలో విత్తనాలతో మట్టి విగ్రహాలకు రూపమిచ్చారు. వీటిని పూజించాక ఒక తొట్టిలో ఉంచి పైనుంచి నీరు పోస్తే విగ్రహం కరుగుతుంది. ఆ తర్వాత అందులోని విత్తనాలు క్రమేసీ మొలకెత్తుతాయి. ఇంటి ఆవరణలో నిత్యం దేవుడిని చెట్టు రూపంలో చూసుకోవచ్చని, గణనాథుడు మన కళ్లెదుట జీవంతో ఉన్నట్లే కదానని కొఠూర్ ఆలోచన.

మా పంట.. మా వంట

- మధ్యాహ్న భోజనానికి అక్కడ పండే కూరగాయలే!
- ఉనికిచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆదర్శం
- రాష్ట్ర స్వచ్ఛ విద్యాలయ్ పురస్కార్‌కు ఎంపిక

ఎటు చూసినా పచ్చదనం..ఏపుగా పెరిగిన వందలాది భారీ చెట్లు.. ఆకుకూరలు, ఇతర కూరగాయల పంటలు.. బాలబాలికలకు వేర్వేరు మరుగుదొడ్లు, చెంత కుళాయిలు, చేతులు శుభ్రం చేసుకునే సబ్బు.. చెత్త వేయడానికి బుట్టలు.. ఇలా ఎంతో పరిశుభ్రంగా కనిపించే ఆ బడిని చూస్తే కార్పొరేట్ పాఠశాలలా కనిపిస్తుంది. కాని అది ప్రభుత్వ ఉన్నత పాఠశాల అంటే ఆశ్చర్యపోకమానం. అందుకే అది రాష్ట్ర స్థాయి స్వచ్ఛ విద్యాలయ్ పురస్కార్‌కు ఎంపికైంది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దిన వేడుకల్లో విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి చేతుల మీదుగా జిల్లా స్థాయి స్వచ్ఛ విద్యాలయ్ అవార్డును కూడా పొందారు. ఈ పాఠశాలలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తుంటారు. ఎక్కువగా పండితే అమ్మి ఆ డబ్బును పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేస్తుంటారు. ఇన్ని ప్రత్యేకతలున్న ఉనికిచర్ల పాఠశాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

–న్యూస్‌టుడే, ధర్మసాగర్



పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదంగా కనిపిస్తున్న ఉనికిచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల



పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

అందమైన ఆశ్రమంలా..

ఉనికిచర్ల ఉన్నత పాఠశాల పరిశుభ్రతకు మారుపేరుగా ఉంటుంది. విశాలమైన ప్రహరీ కల్గి 20 రకాలైన వేయి చెట్లతో నిండి ఒక అందమైన వనాన్ని తలపిస్తుంది. ప్రశాంతతకు నిలయంగా, ఓ ఆశ్రమంలా కనిపిస్తుంది. నీడనిచ్చేవాటితోపాటు, పండ్ల చెట్లు, భవిష్యత్తులో ఆదాయాన్నిచ్చే చెట్లూ ఇక్కడ కనిపిస్తాయి. వీటి మధ్యనే ఆకు కూరలైన పాలకూర, చుక్క కూర, గోంగూర, బచ్చల కూర వంటి పలు రకాల ఆకుకూరలను సాగు చేస్తున్నారు. బెండకాయ, వంకాయ, టమాట, సొరకాయ వంటి కాయగూరలను పండిస్తున్నారు. ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ వంటి రకాలు కూడా ఇక్కడ కనిపిస్తాయి. దాదాపు 105 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి ఇక్కడ పండేవి సరిపోతుంటాయి. సాగు చేస్తూ వాటిని మధ్యాహ్న భోజనానికి వీటినే వాడుతుంటారు. పాఠశాలకు సరిపోయిన తర్వాత మిగతా వాటిని గ్రామస్థులకు విక్రయిస్తుంటారు. వీటితో వచ్చిన మొత్తాన్ని పాఠశాల ఖర్చులకు వాడుతుంటారు.

ఆధునిక పద్ధతిలో విద్యాబోధన

విద్యార్థులకు ఆట పాటలతోపాటు, ప్రయోగాత్మక విద్యను బోధిస్తుంటారు. పని విద్య, సృజనాత్మక విద్య, డిజిటల్ క్లాస్‌లతో విద్యాబోధన ఉండటంతో పిల్లలూ ఆసక్తిగా రోజూ బడికి వస్తుంటారు. విద్యార్థినులకు టాయ్స్, అల్లికల వంటివి పలు రకాల వస్తువుల తయారిని నేర్పిస్తుంటారు. ప్రతి వారం ఎన్‌జీసీ కార్యక్రమం. నేషనల్ గ్రీన్ కార్ప్స్‌తో మొక్కలను పెంచే దానిపై విద్యార్థులకు వివరిస్తుంటారు. వినాయకచవితికి మట్టి విగ్రహాలనే వాడాలనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించటమే కాదు.. గ్రామస్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా చేస్తుంటారు.



జిల్లా స్వచ్ఛ విద్యాలయ్ పురస్కారాన్ని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు జితేందర్‌రెడ్డి, పక్కన కలెక్టర్, డీఈవో శ్రీనివాసాచారి(పాత చిత్రం)

నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి

–అయేషా ఫాతిమా, 9వ తరగతి



పచ్చని చెట్ల మధ్య మా బడి ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుంది. ప్రతి విద్యార్థికి ఏదో ఒక బాధ్యత ఇవ్వడం వలన మాలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. చదువుతోపాటు సమాజం అంటే ఏమిటో తెలుస్తుంది. ప్రైవేటు పాఠశాలలో కూడా ఇలాంటి విద్యా బోధన, వాతావరణం ఉండదు. ఈ పాఠశాలలో చదువుకోవడం మా అదృష్టం.

ఇక్కడి కూరగాయలు మాకే

–సీహెచ్. శిరిష, పదో తరగతి



మా పాఠశాల ఆవరణలో పండిన కూరగాయలను మేమే వినియోగించుకుంటున్నాం. ఎలాంటి రసాయన మందులను వేయకుండా వాటిని పండించటం వలన ఎంతో రుచికరంగా కూరలు ఉంటాయి. మూడు నాలుగు సంవత్సరాలుగా ఇలాగే చేస్తున్నాం. పాఠశాల సంరక్షణ బాధ్యతలు కూడా మాపైనే ఉన్నందున ఎంతో అపురూపంగా చూసుకుంటాం.

చాలా సంతోషంగా ఉంది

–జితేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రతను మూడేళ్లుగా పాటిస్తున్నాం. దీని కోసం మా ఉపాధ్యాయ బృందం, పాఠశాల యాజమాన్య కమిటీ, విద్యార్థులందరి సహకారంతో స్వచ్ఛ పాఠశాలగా మార్చుకున్నాం. దీంతో రాష్ట్ర స్థాయి స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైంది. దీనికి చాలా సంతోషంగా ఉంది. ఇటీవల జిల్లా స్వచ్ఛ్ విద్యాలయ్ పురస్కార్ అవార్డును మంత్రి కడియం శ్రీహరి చేతుల మీదుగా తీసుకున్నాం. మా అందరి కృషి దీనివెనుక ఉంది.

అద్భుతం.. ఏకశిల సర్వతోభద్ర ఆలయం!

- జయశంకర్ జిల్లా చిట్యాల మండలం నైన్‌పాకలో అపురూప కట్టడం
- గ్రామస్థుల చొరవతో వెలుగులోకి..
- రూ. 3 కోట్ల నిధులు కేటాయింపు
- త్వరలోనే పనులకు శ్రీకారం
- సర్వే చేపట్టనున్న పురావస్తు శాఖ

జయశంకర్ భూపాలపల్లి: చిట్యాల, న్యూస్‌టుడే



ఒక్కో ఆలయానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది... ఒకటి ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తే.. మరొకటి ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతుంది.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాకలో ఇటీవల వెలుగులోకి వచ్చిన నాపాక ఏకశిల సర్వతోభద్ర కోవెల మాత్రం కలకాలం గుర్తుండిపోయే మధురానుభూతిని ఇస్తుంది.. ఒకే శిలపై నాలుగు వైపులా దేవతా విగ్రహాలు ఉన్నాయిక్కడ. సుందరమైన శిల్పకళా వైభవంతో పాటు, మహిమానిత్వ గుడికి తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి స్థానికులు, స్పీకర్ మధుసూదనాచారి కృషి చేస్తున్నారు.

నైన్‌పాక గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో నాపాక ఏకశిల సర్వతో భద్ర ఆలయం ఉంది. గుడికి నాలుగు ముఖద్వారాలున్నాయి. నాలుగు వైపులా దేవతా విగ్రహాలున్నాయి. తూర్పువైపున శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, పడమర వైపు విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, ఉత్తరం వైపున రాముడు, సీత, లక్ష్మణుడు, దక్షిణం వైపు శ్రీకృష్ణ, రుక్మిణి, సత్యభామ విగ్రహాలున్నాయి. వీటితో పాటు ద్వారపాలక , మూడు వైపులా గరుత్మంతుడు, హనుమాన్, మత్స్య విగ్రహాలు కొలువుదీరాయి. అన్నింటినీ ఒకే శిలతో చెక్కారు. రాతితో నిర్మించిన ఆలయం పైభాగంలో గాలిగోపురం సుమారు 50 అడుగుల ఎత్తులో ఉంది. చుట్టూ కోనేరు, చెరువు, రచ్చబండ, వరుణకొండ, స్వామివారి పాదుకలు, ఇతర నిర్మాణాలు ఉన్నాయి. ఇటీవల కోవెలను సందర్శించిన కేంద్ర, రాష్ట్ర పురావస్తు , దేవాదాయ, ధర్మాదాయ, పర్యాటక శాఖ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



పడమరన శ్రీవిష్ణువు, లక్ష్మీదేవి విగ్రహాలు

కదలిన గ్రామస్థులు..

ఆలయ విశిష్ఠతను గుర్తించిన గ్రామస్థులు దాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏడాదిన్నర క్రితం 30 మందితో కమిటీ ఏర్పాటు చేసుకుని విరాళాలు సేకరించారు. చేయీచేయీ కలిపి శుభ్రం చేశారు. హద్దులు ఏర్పాటు చేయించారు. అర్చకులను నియమించారు. జనవరి 8న వైకుంఠ ఏకాదశి రోజున వైభవంగా జాతరను జరిపారు. అప్పటి నుంచి గుడి గురించి అందరికీ తెలిసింది.

పూర్వవైభవానికి కృషి

స్పీకర్ మధుసూదనాచారి ప్రత్యేక చొరవ తీసుకుని ఆలయ అభివృద్ధికి రూ. 2 కోట్లు మంజూరు చేయించారు. తర్వాత సింగరేణి యాజమాన్యం రూ. 50 లక్షలు, పాలనాధికారి రూ. 50 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రూ. మూడు కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు అభివృద్ధి కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. ఇటీవల విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించారు.

సర్వేతో మరింత సమాచారం

13వ శతాబ్దంలో కాకతీయులే కోవెలను నిర్మించారని స్థానికులు చెబుతున్నారు. తాళపత్ర గ్రంథాలు గానీ, శాసనాలు గానీ లేవు. ఇది కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖల ఆధీనంలో లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పురావస్తు శాఖ సర్వే చేపట్టాలని నిర్ణయించింది. తవ్వకాల ఆధారంగా లభించే వస్తువుల వల్ల ఎప్పటి కాలంలో నిర్మించారో స్పష్టంగా తెలిసే అవకాశం ఉంది. చారిత్రక వివరాలు వెలుగులోకి రానున్నాయి.

ఏకశిలపై నాలుగు వైపులా దేవతామూర్తులుండడం ప్రత్యేకత

– ప్రభాకర్, ఆలయ అర్చకుడు



ఆలయానికి నాలుగు ముఖద్వారాలు ఉండటంతో పాటు, ఏకశిలపై నాలుగు వైపులా దేవతా మూర్తులు ఉండటం ప్రత్యేకత. ఇది దక్షిణ భారతదేశంలోనే అరుదైన విషయం. మూల విరాట్టు ఎంతో గంభీర్యాన్ని సంతరించుకుని ఉంటుంది. స్పీకర్ చొరవతో అభివృద్ధి ప్రణాళికలు చేస్తున్నారు.